

టీచర్ల బదిలీలకు సర్వం సిద్ధం

- 4,811 మందికి స్థాన చలనం
- ఐదు/ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తిచేసినవారు 2,121 మంది
- సర్దుబాటు ద్వారా ఏర్పడిన ఖాళీలు 1,851
- ఇప్పటికే ఉన్న ఖాళీలు 780



విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన కసరత్తును విద్యా శాఖ పూర్తిచేసింది. అన్ని కేటగిరీలు కలిపి 4,811 మందికి బదిలీ కానున్నది. ఉమ్మడి జిల్లాలో జడ్పీ, ప్రభుత్వ, మునిసిపల్ పాఠశాలల్లో సుమారు 15 వేల మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా వారిలో మూడో వంతు టీచర్లు ప్రస్తుతం పనిచేసే చోట నుంచి మరో చోటకు వెళ్లనున్నారు. జీవో 117 రద్దు చేసిన కూటమి ప్రభుత్వం పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు సిద్ధమైంది. ఉమ్మడి జిల్లాలో ఏడు రకాల పాఠశాలలు ఏర్పాటుకానున్నాయి. దీనికి అనుగుణంగా విద్యార్థి, టీచర్ నిష్పత్తిని పరిగణనలోకి తీసుకున్న విద్యా శాఖ అధికారులు 1,851 పోస్టులను ఒక చోట నుంచి మరోచోటకు సర్దుబాటు చేశారు. సర్దుబాటు ద్వారా పోస్టు బదలాయింపు జరిగిన చోట కొత్తగా టీచర్లను నియమించాల్సి ఉంటుంది. దీంతో 1,851 మంది టీచర్లకు స్థాన చలనం కలగనున్నది. ఇక ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న హెచ్ఎంలు, ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన స్కూలు అసిస్టెంట్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ టీచర్లు 2,121 మంది ఉన్నట్టు

... మిగతా 6వ పేజీలో



15 మంది కార్పొరేటర్లు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు ప్రకటిస్తున్న జేసీ అశోక్



సమావేశానికి హాజరైన మేయర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

మహా ఉత్కంఠ

కోరం లేక డిప్యూటీ మేయర్ ఎన్నిక నేటికి వాయిదా

పదవి కోసం టీడీపీ, జనసేన మధ్య పోటీ

- చివరకు జనసేనకు కేటాయించాలని నిర్ణయం
- 43వ వార్డు కార్పొరేటర్ ఉషశ్రీ పేరు ప్రకటించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ
- వ్యతిరేకించిన 'దేశం' కార్పొరేటర్లు
- అధిష్ఠానం నిర్ణయమంటూ చివరికి 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పేరు ఖరారు
- ఎన్నికను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన యాదవ, కాపు సామాజిక వర్గాలకు చెందిన 15 మంది కార్పొరేటర్లు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఆసాంతం హైడ్రామా నడిచింది. డిప్యూటీ మేయర్ ఎన్నిక సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి హోదాలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రకటించారు. అయితే డిప్యూటీ మేయర్ పదవి కోసం టీడీపీ, జనసేన మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో ఆదివారం అర్ధరాత్రి వరకూ ఎటూ తేల్చుకోలేకపోయారు.



డిప్యూటీ మేయర్ పదవికి జనసేన ఎంపిక చేసిన 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి

యాదవ సామాజిక వర్గానికి చెందిన మహిళను మేయర్ పదవి నుంచి తొలగించినందున, ఆ వర్గానికి చెందిన మహిళను డిప్యూటీ మేయర్ చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేస్తూ వచ్చారు. దీంతో ఆ సామాజికవర్గానికి చెందిన మహిళా కార్పొరేటర్లు తమకు అవకాశం వస్తుందని ఆశించారు. మరోవైపు డిప్యూటీ మేయర్‌గా కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని తొలగించినందున, ఆ వర్గానికే తిరిగి పదవిని కేటాయించాలనే వాదన వినిపించింది. దీంతో ఆ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు ఆశలు పెట్టుకున్నారు. చివరకు ఆదివారం రాత్రి నగరంలోని ఒక హోటల్‌లో సుదీర్ఘ భేటీ నిర్వహించిన కూటమి ప్రజా ప్రతినిధులు డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు ఇవ్వాలని నిర్ణయానికి వచ్చారు. జనసేన నుంచి 43వ వార్డు కార్పొరేటర్ పి.ఉషశ్రీతోపాటు 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్టు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. సోమవారం ఉదయం కూటమి కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులంతా దసపల్లా హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉషశ్రీ, గోవిందరెడ్డి పేర్లను తాము పరిశీలిస్తున్నామని, ఉషశ్రీని ఖరారు చేయాలని భావిస్తున్నామని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ చెప్పారు. దీనికి టీడీపీకి చెందిన కార్పొరేటర్లంతా అభ్యంతరం చెప్పడంతోపాటు వైసీపీ నుంచి ఇటీవలే జనసేనలో చేరిన ఆమెకు ఇస్తే తామంతా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం నుంచి వచ్చిన

... మిగతా 6వ పేజీలో

కోరం లెక్కింపులో అధికారుల అత్యుత్సాహం

54 మంది హాజరైతే... 56 మంది ఉన్నట్టు ఎన్నికల అధికారికి లెక్కలు

- మరోసారి లెక్కించాలని జేసీ ఆదేశం

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నిక కోసం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన జీవీఎంసీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగా, అప్పటికి కేవలం పది మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. తర్వాత ఒక్కొక్కరుగా రావడం ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటల వరకూ ఎదురుచూస్తానని, తర్వాత హాల్ తలుపులు మూసివేసి హాజరైన సభ్యులను లెక్కించి, కోరం సరిపోతే ఎన్నిక ప్రక్రియ ప్రారంభిస్తానని, లేనిపక్షంలో మంగళవారానికి వాయిదా వేస్తానని జాయింట్ కలెక్టర్ తెలిపారు. 11.45 గంటలకు కేవలం 20 మంది మాత్రమే హాజరయ్యారు. అప్పటికి ఎక్స్‌అఫీషియో సభ్యుల్లో జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణశ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, టీడీపీ ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాత్రమే ఉన్నారు. టీడీపీకి చెందిన కాపు, యాదవ సామాజికవర్గం కార్పొరేటర్లు ఎన్నికను బహిష్కరించి, వేరే హోటల్‌లో సమావేశమయ్యారని తెలియడంతో టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలకు, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావుకు జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఫోన్ చేసి కార్పొరేటర్లను పిలవాలని కోరారు. తర్వాత మరికొందరు కార్పొరేటర్లు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు హాల్‌లోకి వచ్చారు. సరిగ్గా 12 గంటలకు హాల్ తలుపులను మూసివేయాలని ఎన్నికల అధికారి ఆదేశించారు. వరుసల వారీగా సభ్యులను లెక్కించాలని 'రో అధికారులను' ఆదేశించారు. ఎక్స్‌అఫీషియో సభ్యులతో కలిపి మొత్తం 54 మంది సభ్యులు హాజరైతే 56 మంది హాజరయ్యారని, కోరం సరిపోయిందంటూ అధికారులు ఎన్నికల అధికారికి వివరించారు. అయితే వరుసల వారీగా సభ్యులను లెక్కించిన ఎన్నికల అధికారి లెక్కలో తేడా ఉందని, మరోసారి లెక్కించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో 54 మంది మాత్రమే హాజరైనట్టు నివేదిక ఇచ్చారు. ఎన్నికల అధికారి ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నాసరే పెద్దపొరపాటు జరిగిపోయేది. సమావేశాన్ని వాయిదా వేసిన తర్వాత ఎన్నికల అధికారి తనకు తప్పుడు నివేదిక ఇచ్చిన అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది.

అసంతృప్త కార్పొరేటర్లతో కూటమి ఎమ్మెల్యేల సంప్రతింపులు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపికపై అసంతృప్తితో సోమవారం ఎన్నికను బహిష్కరించిన కార్పొరేటర్లతో కూటమి ఎమ్మెల్యేలు సంప్రతింపులు జరిపారు. పొత్తు ధర్మంలో భాగంగానే జనసేనకు డిప్యూటీ మేయర్ పదవిని ఇవ్వాల్సి వచ్చిందని టీడీపీ ఎమ్మెల్యేలు తమకు సన్నిహితులైన కార్పొరేటర్లకు ఫోన్ చేసి వివరించారు. రెండో డిప్యూటీ మేయర్ పదవిని కచ్చితంగా టీడీపీ తీసుకుంటుందని అప్పుడు సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకుని సమష్టిగా అభ్యర్థిని ఎంపిక చేద్దామని బుజ్జగించే ప్రయత్నం చేశారు. మంగళవారం జరిగే డిప్యూటీ మేయర్ ఎన్నికకు హాజరుకావాలని కోరారు. అయితే అసంతృప్త కార్పొరేటర్లు పలువురు తమ సీనియారిటీ, పార్టీ పట్ల విధేయత, మేయర్ ఎన్నిక సందర్భంగా తాము ఎదుర్కొన్న ఇబ్బందులను ఏకరువుపెట్టినట్టు తెలిసింది. మంగళవారం కూడా తాము హాజరయ్యే ప్రసక్తి లేదని కొందరు తేల్చిచెప్పినట్టు సమాచారం. దీంతో మంగళవారం ఏం జరుగుతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

స్టీల్‌ప్లాంటు వద్ద ఉద్రిక్తత

- నేడు కార్మికుల సమ్మె నేపథ్యంలో నేతలపై పోలీసుల ఆంక్షలు
- ఇరువర్గాల మధ్య తోపులాట
- నాయకుల అరెస్టు
- రహదారిపై బైఠాయించిన మిగిలిన కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, మే 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు గేటు వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం కార్మికుల సమ్మె నేపథ్యంలో సోమవారం సాయంత్రం భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. అనుమతి లేకపోవడంతో సభను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో రోడ్డుపక్కన నిల్చుని కార్మిక నాయకులు నినాదాలు చేయగా, పోలీసులు వారించారు. ఈ క్రమంలో కార్మిక నాయకులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. కొంతమంది కార్మిక సంఘ నాయకులను అరెస్టు చేసి స్టీల్‌ప్లాంటు స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా ప్రచారం చేసుకునేందుకు వస్తే పోలీసులు అడ్డుకోవడం తగదంటూ కార్మికులు రోడ్డుపై బైఠాయించారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ వచ్చి కార్మిక నాయకులకు నచ్చజెప్పి అక్కడ నుంచి



పోలీసులు, కార్మిక నాయకుల మధ్య తోపులాట

పంపేశారు.

పోలీసులు తీరు సరికాదు...

సమ్మె ప్రాధాన్యంపై ప్రచారం చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు ఆరోపించారు. కార్మిక నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, ఇది మంచి పద్ధతి కాదని, శాంతియుతంగా చేస్తే ఇబ్బందులు సృష్టించడం సరికాదని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంటులో సమ్మె సైరన్

- నేటి నుంచి కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె
- రెగ్యులర్ కార్మికులు ఒకరోజు... -మెయిన్‌లో
- అధికారులకు 12 గంటల చొప్పున విధులు



కేజ్ కల్చర్, ఆర్టిఫీషియల్ రీఫ్స్ ఏర్పాటుకు జెండా ఊపుతున్న మంత్రి కె.అచ్చెన్నాయుడు

ఆర్థిక వ్యవస్థకు మత్స్య పరిశ్రమ కీలకం

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- సముద్రంలో చేపల పెంపకానికి కృత్రిమ ఆవాసాలు ఏర్పాటు

బీచ్‌రోడ్డు, మే 19 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థకు మత్స్య పరిశ్రమ అత్యంత కీలకమని రాష్ట్ర మత్స్య, పశు సంవర్థక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని జాలరిపేట, ఎండాడ వద్ద సముద్రంలో చేపల పెంపకానికి కేజ్ కల్చర్, కృత్రిమ ఆవాసాలు(ఆర్టిఫీషియల్ రీఫ్స్)ను సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ సముద్రంలో కృత్రిమ ఆవాసాలను ఏర్పాటుచేయడం వల్ల మత్స్య సంపద వృద్ధి చెంది మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మొదట విడతగా 22 కృత్రిమ ఆవాసాల యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని ఇతర జిల్లాల తీర ప్రాంత సముద్ర జలాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌లో మెకనైజ్డ్ బోట్లకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 634 ట్రాన్స్‌పాండర్స్‌ను వంద శాతం సబ్సిడీపై అందించినట్టు తెలిపారు. తుఫాన్లు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మత్స్యకారులకు జీపీఎస్, ఎకో సౌండర్, బోట్లు, ఇంజన్లు, వలలు, తాళ్లు వంటి పరికరాలను సబ్సిడీపై సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న డీజిల్ సబ్సిడీ, ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ రామ్‌శంకర్‌నాయక్, మత్స్య శాఖ సహాయ సంచాలకులు పి.లక్ష్మణరావు, సీఎంఎఫ్ఆర్ఐ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జోయ్‌కిన్ పాల్గొన్నారు.

షర్మిల వ్యవహారశైలితో పార్టీ నిర్వీర్యం

విశాఖలో అసమ్మతి నేతల సమావేశం

- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ హాజరు
- అగ్రనాయకత్వం దృష్టికి సమస్యను తీసుకువెళతానన్న కిల్లి కృపారాణి



సమావేశంలో వినతిపత్రాలు స్వీకరిస్తున్న కిల్లి కృపారాణి. చిత్రంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ ఉన్నారు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యవహారశైలితో పార్టీ నిర్వీర్యమవుతోందని పలువురు నాయకులు విమర్శించారు. షర్మిల నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నాయకులు సోమవారం దొండపర్తిలోని హోటల్ సింకా గ్రాండ్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి హాజరయ్యారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన నాయకులను షర్మిల పట్టించుకోవడం లేదని పలువురు నేతలు ఆరోపించారు. పార్టీని బలోపేతం చేసేందుకు అనుగుణంగా ఎటువంటి చర్యలను తీసుకోవడం లేదన్నారు. షర్మిల పగ్గాలు చేపట్టిన తరువాత పార్టీ మరింత అధ్వాన స్థితికి చేరుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితిని సీనియర్లు అగ్రనాయకత్వం దృష్టికి తీసుకువెళ్లి సంస్థాగతంగా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ పార్టీలో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని,

... మిగతా 6వ పేజీలో

ఏయూలో విద్యా విభాగం మనుగడ ప్రశ్నార్థకం

- మూడేళ్ల కిందట విద్యా భవన్ నుంచి తాత్కాలికంగా హెచ్ఆర్ఎం విభాగానికి మార్పు
- అదే ఇప్పుడు బీఈడీ (స్పెషల్), ఎంఈడీ కోర్సుల నిర్వహణకు ఇబ్బందిగా మారిన వైనం
- ఆయా కోర్సులు కొనసాగాలంటే వసతులతో కూడిన భవనం కీలకం
- ఈ ఏడాది నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్, ఆర్‌సీఐ నుంచి బృందాలు తనిఖీకి వచ్చే అవకాశం
- అదే జరిగితే మౌలిక వసతులు లేవని కోర్సులు రద్దు చేసే ప్రమాదం

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అత్యంత కీలకమైన వాటిల్లో విద్యా విభాగం ఒకటి. ఈ విభాగంలో బీఈడీ, ఎంఈడీతో పాటు రెండేళ్ల క్రితం వరకూ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సును నిర్వహిస్తూ వచ్చారు. ఈ కోర్సులకు భారీగా డిమాండ్ ఉంటోంది. ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు చేరుతున్నారు. అటువంటి కోర్సుల నిర్వహణ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వర్సిటీలో గత అధికారులు తీసుకున్న నిర్ణయం ఆ విభాగం రద్దుకు కారణమయ్యేలా ఉంది.

డిపార్టుమెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఎంఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (అంధుల కోసం), ఎంఏ అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సులను నిర్వహించేవారు. ఈ



విద్యా భవనం (ఫైల్ ఫొటో)

కోర్సుల నిర్వహణకు సువిశాలమైన విద్యా భవన్ అందుబాటులో ఉండేది. అత్యాధునిక క్లాస్ రూమ్‌లతో పాటు ల్యాబ్‌లు, లైబ్రరీ, సెమినార్ హాల్స్, హెడ్, ఫ్యాకల్టీ రూమ్స్ ఉండేవి. అయితే, మాజీ వీసీ ప్రసాదరెడ్డి ఒకరోజు అకస్మాత్తుగా ఆ భవనాన్ని ఖాళీ చేయాలంటూ విభాగ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అక్కడ మహిళల వసతి గృహాన్ని నిర్వహిస్తామని, తాత్కాలికంగా హెచ్ఆర్ఎం విభాగాన్ని నిర్వహించే

... మిగతా 6వ పేజీలో

ముగ్గురు సీఐల బదిలీ

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో ముగ్గురు సీఐలకు బదిలీ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వెయిటింగ్‌లో ఉన్న జి.గోవిందరావుకు స్పెషల్ బ్రాంచి-3 సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ పనిచేస్తున్న ఎన్.వి.ప్రభాకరరావును గోపాలపట్నం సీఐగా, గోపాలపట్నం సీఐగా పనిచేస్తున్న గొలగాని అప్పారావును మల్కాపురం సీఐగా బదిలీచేశారు.

రైళ్ల రీషెడ్యూల్

- గంటల తరబడి ఆలస్యం
- ప్రయాణికుల అవస్థలు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): రైళ్ల రీ షెడ్యూల్ కారణంగా సోమవారం ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఒరిజినేటింగ్ స్టేషన్ల నుంచి గంటల తరబడి ఆలస్యంగా బయలుదేరడంతో విశాఖతోపాటు వివిధ స్టేషన్ల నుంచి గమ్యానికి చేరాలనుకున్న ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సోమవారం హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703), హౌరా-బెంగళూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22863), షాలిమార్-చెన్నై సెంట్రల్ వేసవి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (02841), షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ (12841), విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలు (08583), శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి ప్రత్యేక రైలు (07426) వంటి ప్రధాన రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అలాగే ఆదివారం రాత్రి బయలుదేరాల్సిన హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12863), హౌరా-పాండిచ్చేరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12867), హౌరా-చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ (12839), బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (12864), హౌరా-జగదల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18005) రైళ్లను సోమవారం ఉదయం బయలుదేరే విధంగా రీ షెడ్యూల్ చేయడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. రీ షెడ్యూల్ చేసినట్టు ముందుగా మెసేజ్ ద్వారా రైల్వే శాఖ తెలియజేయడంతో కొందరు ప్రయాణికులు టికెట్ రద్దు చేసుకుని ప్రత్యామ్నాయ రవాణా మార్గాల ద్వారా గమ్యానికి చేరుకునే ప్రయత్నం చేయగా, మరికొందరు తప్పనిసరి పరిస్థితుల్లో గంటల తరబడి నిరీక్షించారు.

డ్రైనేజీలు లేక రోడ్డుపై మురుగు నీరు



రోడ్డు పక్కన నిలిచిన మురుగు

పద్మనాభం, మే 19 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం - రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బీటీ నిర్మాణం 80 శాతం పూర్తయినా మిగిలిన పనులు ఇంకా పూర్తి కాలేదు. పనుల్లో భాగంగా రెడ్డిపల్లి గ్రామంలో ప్రధాన రహదారిలో చేపట్టాల్సిన డ్రైనేజీ నిర్మాణం పూర్తి కాకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. రోడ్డు నిర్మించి కాలువలు మరిచారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో వాడుక నీరు వెళ్లడానికి మార్గం లేక ఎక్కడికక్కడ నిలిచిపోతుండడంతో విపతరీమైన దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాత కాలువలను తవ్వేశారు. ఈ కాలువలో మంచినీటి పైపులైను కూడా ఉంది. ఎక్కడైనా లీకేజీ జరిగి మంచినీటిలో మురుగునీరు చేరితే ప్రజల ఆరోగ్య పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఈ పనులను కూడా ఆర్అండ్‌బీ శాఖ చేపట్టాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఈ పనులు పూర్తి కాలేదు. రెడ్డిపల్లి-కోరాడ రోడ్డులో కల్వర్టు స్లాబు కూడా దెబ్బతింది. ఆ రోడ్డులో ప్రయాణాలు చేసే వారికి శిథిలమైన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టాల్సిన కాలువలను సత్వరమే నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

కూలిపోయే దశలో చెట్టు



పూర్తిగా ఒకవైపునకు వాలిపోయిన చెట్టు (ఇన్‌సెట్లో) దెబ్బతిన్న మొదలు

భీమునిపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలో రహదారి పక్కనున్న చెట్టు కూలిపోయే దశలో ఉంది. భీమిలి నుంచి తగరపువలస వెళ్లే ఈ రోడ్డు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఆర్టీసీ కాంప్లెక్స్, మినీ స్టేడియం మధ్య ఉన్న చెట్టు ఒకవైపునకు పూర్తిగా వాలిపోయి ఉండ డం, మొదలు వద్ద విరిగి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు భయపడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

గోస్తనీ వంతెనలపై నిత్యం ట్రాఫిక్ కష్టాలు



విశాఖ వైపు వెళ్లే వంతెన ప్రారంభ కూడలిలో నిలిచిపోయిన ట్రాఫిక్

తగరపువలస, మే 19 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస జాతీయ రహదారిపై గోస్తనీ నది వంతెనల వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.ఈ ప్రాంతంలో ప్రమాదాలు కూడా తరచూ జరుగుతున్నాయి. ఇక్కడ ఒకవైపు నగరపాలెం, తాటితూరు వెళ్లడానికి రహదారి, మరోవైపు చిప్పాడ, అన్నవరం వైపు వెళ్లే రహదారి కలుస్తాయి. అలాగే ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన బస్సులు నిత్యం తిరుగుతుంటాయి. రెండు సర్వీసు రోడ్లు ఇక్కడి నుంచే ప్రారంభమవుతాయి. అంతేకాకుండా వంతెనకు ఇరువైపులా పలు హోటళ్లు ఉండడంతో వాహనదారులు జాతీయ రహదారిపై ఇష్టానుసారం వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ట్రాఫిక్ తరచూ స్తంభిస్తున్నా.. అనేక ప్రమాదాలు జరుగుతున్నా.. పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

28న శిథిల భవనాలు తొలగింపునకు వేలం

భీమునిపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గురుకుల బాలికల పాఠశాలలో శిథిలమైన డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, ఇతర భవనాలను తొలగించి సామగ్రి తీసుకువెళ్లేందుకు ఈనెల 28న బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆ పాఠశాల హెచ్ఎం రామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు రూ. 3,000 ధరావత్తు సొమ్ము, ప్రవేశ రుసుం రూ. 1000 డీడీలు తీయాలన్నారు. వీటిని ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా భీమిలి ఏపీఆర్ఎస్ స్కూల్ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్ సెల్ నంబర్లు 8712625025, 8309519107 ను సంప్రతించాలని ఆయన సూచించారు.

పీజీఆర్ఎస్‌కు ఐదు వినతులు

భీమునిపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోన్ వన్‌లో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి (పీజీఆర్ఎస్) అయిదు వినతులు అందాయి. జడ్సీ అయ్యప్పనాయుడు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ ప్రణాళికా విభాగానికి ఒక వినతి, ఇంజనీరింగ్ విభాగానికి నాలుగు వినతులు అందాయి. ఫిర్యాదులను సంబంధిత విభాగాధిపతులకు పంపినట్టు జడ్సీ తెలిపారు.

జీవితాలకు దర్పణం నీతి కథలు



సింహాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి) : కవులు, రచయితలు రచించిన నీతి కథలు మానవ జీవితాలకు దర్పణమని రిటైర్డ్ హెచ్ఎం కెఎస్ఆర్ మూర్తి అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయాధికారి ఎస్‌వీ నరసింహం ఆధ్వర్యంలో గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం ఆయన మాట్లాడారు. కథల్లో కనిపించే నీతి మానవ జీవిత యథార్థ గాథలే అన్నారు. అంతకుముందు పిల్లలతో నీతి కథలు చదివించి, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకుడు సూర్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం



తుప్పు పట్టిన స్తంభం

పెదవాల్తేరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేట చేపల మార్కెట్ ప్రజా ఆరోగ్య కేంద్రం (గీతం హస్పిటల్) వద్ద హైమాస్ట్ లైట్స్ స్తంభం తుప్పపట్టి ప్రమాదకర స్థితిలో ఉంది. ఇక్కడి ప్రజా ఆరోగ్య కేంద్రానికి, చేపల మార్కెట్‌కు పెదజాలరిపేట, వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. తుప్పు పట్టిన స్తంభం ఎవరిపై కూలిపోతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.అలాగే కొద్ది నెలల నుంచి హైమాస్ట్ లైట్స్ వెలగడం లేదని,దీంతో సాయంత్రమైతే ఈ ప్రాంతం చీకటిమయంగా మారుతోంది.



గతంలో రోడ్డు దుస్థితి (ఫైల్)



కొత్తగా నిర్మించిన తారురోడ్డు

బాగుపడిన మార్గం

- గండిగుండం, భీమన్నదొరపాలెం రహదారికి మోక్షం
- రూ. 1.40 కోట్ల ఉపాధి నిధులతో తారు రోడ్డు నిర్మాణం

విశాఖపట్నం/ఆనందపురం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలం గండిగుండం జంక్షన్ నుంచి భీమన్నదొరపాలెం వరకు శిథిలావస్థలో ఉన్న రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఐదేళ్లుగా ఈ రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ. 1.4 కోట్లతో తారురోడ్డు నిర్మిస్తోంది. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గండిగుండం జంక్షన్ నుంచి భీమన్నదొరపాలెం గ్రామానికి 4.5 కిలోమీటర్లు ఉంటుంది. రామవరం, భీమన్నదొరపాలెం, కోలవానిపాలెం, కణమాం పంచాయతీల ప్రజలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు చేస్తుంటారు. అలాగే ఈ రోడ్డు మీదుగా విజయనగరం జిల్లా కొత్తవలస వరకు రాకపోకలు సాగించవచ్చు. వైసీపీ పాలనలో ఈ రహదారిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. కనీసం పాదచారులు నడిచేందుకు కూడా వీలులేని విధంగా దెబ్బతింది.గత ప్రభుత్వంలో ప్రజలు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పాలకులు పట్టించుకోలేదు. చివరకు ఆయా గ్రామాల ప్రజలు సమీపంలోని క్వారీల నుంచి ట్రాక్టర్లతో క్రషర్ తెచ్చి సొంతంగా గోతులు పూడ్చారు. అది కూడా తాత్కాలిక ఉపశమనం తప్ప శాశ్వతంగా ఇబ్బందులు పోలేదు. కూటమి వచ్చిన తరువాత రోడ్ల మరమ్మతుకు నిధులు కేటాయించే క్రమంలో గండిగుండం-భీమన్నదొరపాలెం రోడ్డుకు ఉపాధి నిధుల నుంచి తొలి విడతగా రూ. 1.4 కోట్లు విడుదల చేశారు. రెండు నెలలుగా కాంట్రాక్టరు గండిగుండం జంక్షన్ నుంచి రోడ్డు మరమ్మతులు చేపట్టి తరువాత తారు రోడ్డు నిర్మించారు. ఇప్పటి వరకు గండిగుండం జంక్షన్ నుంచి రామవరం వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మించారు. ఇరవై అడుగుల వెడల్పుతో నిర్మించిన రోడ్డుపైకి కొండల మీద నుంచి వచ్చే వర్షపు నీరు ప్రవహించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రోడ్డు నిర్మాణం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు సంపెంగ మాలికలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర రీతిలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న అన్నవరం దేవస్థానం ఈఓ



కప్ప స్తంభం వద్ద ఈఓ దంపతులు

సింహాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని తూర్పుగోదావరి జిల్లా అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ఈఓ సుబ్బారావు సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా, గోదాదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి ఎంవీపీ కాలనీకి చెందిన జీఆర్‌కే పంత్ రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,00,116లను నగదు రూపంలో ప్రజా సంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి సీవీవీ పద్మనాభరాజుకు సోమవారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

నేడు మినీ మహానాడు

భీమునిపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలోని పీఎం పాలెం క్రికెట్ స్టేడియం సమీపంలో ఉన్న ఎస్. కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం టీడీపీ మినీ మహానాడు జరగనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా భీమిలి బీచ్ రోడ్‌లో వున్న టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీ బయలు దేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అధ్వానంగా ఓపెన్ జిమ్ నిర్వహణ



జిమ్‌లో కింద పడిపోయిన పరికరాలు

కొమ్మాది, మే 19 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది గ్రామంలోని చెరువు చుట్టూ రూ. 50 లక్షలతో సుందరీకరణ పనులు చేసి, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. జిమ్‌లో పరికరాలు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో బీటలు వారి పరికరాలు పడిపోతున్నాయి. జిమ్‌కు ఎక్కువగా చిన్న పిల్లలు ఆడుకోవడానికి వస్తుంటారు. పొరపాటున వారు ఆడుకునే సమయంలో పరికరాలు వారిపై పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు తక్షణమే స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ, శివశక్తినగర్, ఆర్టీసీ కాలనీ, నగరంపాలెం,చంద్రంపాలెం, రేవళ్లపాలెం, దుర్గానగర్, వాంబేకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, గణేష్‌నగర్, సాయిప్రియ లేఅవుట్, వల్లీనగర్, మిథిలాపురి వుడాకాలనీ, ఎన్‌జీఓ కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేడు బక్కన్నపాలెంలో..

కొమ్మాది : బక్కన్నపాలెం ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని శంభువానిపాలెం 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల వల్ల మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ నరేశ్ తెలిపారు. బక్కన్నపాలెం, ఎన్‌టీఆర్ కాలనీ, లచ్చిరాజు లేఅవుట్, రైల్వేలేఅవుట్,పోలీస్ బెటాలియన్ ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

నేడు తగరపువలస రైతుబజారు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తగరపువలస, మే 19 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస రైతుబజారును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ఈనెల 13న 'ప్రైవేటు సంతలో రైతుల ఇక్కట్లు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఎమ్మెల్యే స్పందించి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. నిర్మాణాలు పూర్తి కావడంతో వెంటనే ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈమేరకు మార్కెట్ కమిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు. గ్రంథాలయం వీధిలో జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు సమీపంలో నిర్మించిన రైతుబజారు ఏడాదిగా ప్రారంభానికి నోచుకోలేదు. ఎట్టకేలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే రైతులకు ఇంకా దుకాణాల కేటాయిపు జరపలేదు. కాగా తగరపువలస కూడలిలో ప్రైవేటు స్థలంలో సంత ఉంది. దీన్ని రైతుబజారుకు తరలిస్తామని అధికారులు మొదటి నుంచీ చెబుతున్నారు. కానీ ఇది సాధ్యమేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఇక్కడ వ్యాపారం జరిగితే రైతుబజారు ఏర్పాటు చేసినా ఫలితం ఉండదని పలువురు పేర్కొంటున్నారు.

అలంకారప్రాయంగా పోలీసు ఔట్‌పోస్టు



సింహగిరిపై ఏర్పాటు చేసిన ఔట్‌పోస్టు

సింహాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో సింహగిరిపై ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్టు అలంకారప్రాయంగా మారింది. అప్పటి నగర పోలీస్ కమిషనర్, దేవస్థానం ఈఓతో కలిసి గోపాలపట్నం పోలీసు స్టేషన్ అండర్‌లో పని చేసే విధంగా ఈ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. సింహగిరికి వచ్చే భక్తులు మోసాలకు గుర్వకుండా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఔట్‌పోస్టు ఉపయోగపడుతుందని, విధుల నిర్వహణకు ఒక ఏఎస్ఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు నిత్యం అందుబాటులో ఉంటారని అప్పటి సభలో సీపీ ప్రకటించారు. ఇప్పటివరకు ప్రతిరోజూ హోమ్‌గార్డు, పోలీసు కానిస్టేబుల్‌ను గోపాలపట్నం పోలీసు అధికారులు విధులకు కేటాయిస్తూనే ఉన్నారు. కానీ గత కొన్ని నెలలుగా ఔట్‌పోస్టులో ఏ సమయంలో చూసినా కానిస్టేబుల్ కాని, హోమ్‌గార్డు కాని కనిపించడం లేదు. వారు ప్రతిరోజూ విధులకు వస్తున్నా- స్టేషన్‌లో మాత్రం ఉండడం లేదు. తమ శాఖకు చెందిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రముఖులకు దర్శనాలు చేయడమే సిబ్బందికి ముఖ్యమైన పనిగా మారింది. సింహగిరిపై చిలక జోస్యం పేరుతో కొందరు, హిజ్రాలు, ఇతరులు అనేక రకాలుగా భక్తులను దోపిడీ చేస్తున్నా.. పోలీసులు పట్టించుకోకపోవడం పట్ల పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

బంగారమ్మ తల్లి పండగ పోస్టర్లు ఆవిష్కరణ



పండగ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

పద్మనాభం,మే 19 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో వచ్చేనెల 2 నుంచి 4వ తేదీ వరకూ జరిగే బంగారమ్మ తల్లి పండగ పోస్టర్లను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పద్దు,ఎర్నాయుడు, రాము, శ్రీను, వెంకటాచారి, సుమంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు బీజేపీ కుట్ర

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆరోపణ

ఉక్కుటౌన్‌షిప్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆరోపించారు. స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు మంగళవారం నుంచి సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం కర్మాగారం గేటు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంటును పరిరక్షించేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం వెనక్కి తగ్గాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆరోపించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, పీవీ రమణమూర్తి, యు.రామస్వామి, వైటి.దాసు, జి.గణపతిరెడ్డి, సీఐటీయూ నాయకులు జగ్గునాయుడు, ఆర్ఎస్‌వీ కుమార్, అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

మహా ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

సీల్డ్ కవర్‌లో దల్లి గోవిందరెడ్డి పేరు ఉన్నందున ఆయన్నే డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా వంశీకృష్ణ ప్రకటించారు. దీంతో డిప్యూటీ మేయర్ పదవిని ఆశించిన టీడీపీకి చెందిన యాదవ, కాపు సామాజిక వర్గాలకు చెందిన 15 మంది కార్పొరేటర్లు ఎన్నికను బహిష్కరిస్తున్నామని చెప్పి జీవీఎంసీ కౌన్సిల్‌హాల్‌కు వెళ్లకుండా బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌కు వెళ్లిపోయారు.

కోరం లేకపోవడంతో నేటికి వాయిదా

కోరం లేకపోవడంతో డిప్యూటీ మేయర్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారి హోదాలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రకటించారు. జీవీఎంసీలో 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు మొత్తం 111 మంది ఓటు హక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. వీరిలో సగం మంది సభ్యులు అంటే 56 మంది సమావేశానికి హాజరుకావాల్సి ఉంటుంది. కానీ ఏడుగురు ఎమ్మెల్యేలు (వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు), ఒక ఎమ్మెల్సీ (వేపాడ చిరంజీవిరావు)తోపాటు 48 మంది కార్పొరేటర్లు మొత్తం 54 మంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కాగా, 12 గంటలకు కూడా కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ప్రకటించారు.

షర్మిల వ్యవహారశైలితో పార్టీ నిర్వీర్యం

... 5వ పేజీ తరువాయి

ఇదే విషయాన్ని తనకు తెలియజేశారన్నారు. పార్టీ పెద్దలతో తనకు ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడి పరిస్థితులను తెలియజేయాలని పలువురు కోరారన్నారు. ఈ విషయాలను పార్టీ అధ్యక్షుడు ఖర్గేతోపాటు అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ఆమె వివరించారు. పార్టీని బలోపేతం చేసేందుకు షర్మిల చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న నాయకులతో మాట్లాడేందుకు కూడా ఆమె ప్రయత్నించడం లేదని, అనేక జిల్లాల్లో సీనియర్ నేతలకు తెలియకుండానే కీలక బాధ్యతల నుంచి తప్పించినట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, కడప జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు శ్రీరాములు, జిల్లా నాయకులు రుత్తల శ్రీరామమూర్తి, గుత్తుల శ్రీనివాస్, మాజీ డీసీసీ ప్రెసిడెంట్ అన్నాజీ, దొమ్మేటి రమణరావు, సుజాత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలకు సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

గుర్తించారు. దీంతో వారందరికీ తప్పనిసరిగా బదిలీ జరగనున్నది. అలాగే పదవీ విరమణ, పదోన్నతి పొందిన, మరణించిన లేదా ఇతర కారణాల వల్ల 780 ఖాళీలు న్నట్టు గుర్తించారు. త్వరలో జరగనున్న బదిలీల్లో ఆ 780 పోస్టులను భర్తీచేస్తారు. దీర్ఘకాలిక సెలవుపై విదేశాలకు వెళ్లిన టీచర్లు ఐదుగురు, స్టడీ లీవ్‌పై వెళ్లిన 51 మంది, విధులకు గైర్హాజరైన టీచర్లు ముగ్గురి స్థానాలను కూడా బదిలీల ద్వారా భర్తీ చేస్తారు. కాగా ఎంతమందికి స్థానచలనం కలుగుతుందన్న దానిపై ఇప్పటికే నివేదిక రూపొందించామని విశాఖ డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మొత్తం 4,811మంది టీచర్లకు స్థాన చలనం కలుగుతుందన్నారు.

ఏయూలో విద్యా విభాగం మనుగడ ప్రశ్నార్థకం

... 5వ పేజీ తరువాయి

భవంతిలోకి వెళ్లాలని సూచించారు. దాంతో విభాగానికి చెందిన ఫ్యాకల్టీ, సిబ్బంది అత్యవసరంగా విద్యా విభాగాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. తాత్కాలికంగా అన్నారు కాబట్టి మళ్లీ విభాగాన్ని అక్కడకు మార్చుతారేమోనని అనుకున్నారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కోర్సుల నిర్వహణకు ఇబ్బందిగా ఉందని, ఆ భవనాన్ని తమకు కేటాయించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు..చివరకు ఆ విభాగంలో నిర్వహించే కోర్సులు రద్దు చేసే పరిస్థితి వచ్చింది. సాధారణంగా ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో నిర్వహించే బీఈడీ (అంధుల కోసం) స్పెషల్ కోర్సుకు రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) అనుమతి ఇస్తుంది. అలాగే, ఎంఈడీ కోర్సు నిర్వహించాలంటే నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) అనుమతి అవసరం. ఈ కోర్సుల నిర్వహణకు ఆయా సంస్థలు అనుమతి ఇవ్వాలంటే తప్పనిసరిగా విభాగానికి సంబంధించిన వివరాలను అందించాలి. క్లాస్ రూమ్స్, సెమినార్ హాల్స్, లైబ్రరీ, ఫ్యాకల్టీ రూమ్‌లకు సంబంధించిన సమాచారం మెజర్‌మెంట్ ప్రకారం అందించాలి. ఆయా ఫొటోలను జియో ట్యాగింగ్ చేసి పంపించాలి. అప్పుడే ఏటా కోర్సుల నిర్వహణకు అనుమతి లభిస్తుంది. గడిచిన రెండేళ్లుగా విద్యా భవన్‌లోని వివరాలనే విభాగానికి చెందిన అధికారులు ఆయా సంస్థలకు అందిస్తున్నారు. ఈ ఏడాది తనిఖీలకు వచ్చే అవకాశం ఉండడంతో ఫ్యాకల్టీలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం హెచ్ఆర్ఎం విభాగంలో నిర్వహిస్తున్న గదులు, ఫ్యాకల్టీ రూములు, ఇతర సదుపాయాలను చూస్తే కోర్సుల నిర్వహణను ఆయా సంస్థలు ఉపసంహరించుకునే ప్రమాదం ఉందని, అదే జరిగితే పదుల సంఖ్యలో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడల్ట్ ఎడ్యుకేషన్ రద్దు..

ఎడ్యుకేషన్ విభాగంలో నిర్వహించే మూడు కోర్సుల్లో ఒకటైన అడల్ట్ ఎడ్యుకేషన్‌ను మాజీ వీసీ ప్రసాదరెడ్డి 2022-23 విద్యా సంవత్సరంలో రద్దు చేశారు. వసతి లేదన్న కారణాన్ని చూపించి కోర్సు రద్దు చేశారు. 30 సీట్లతో నడిచే ఈ కోర్సును రద్దు కావడంతో ఎంతోమందికి అన్యాయం జరిగింది. ఈ కోర్సు నిర్వహణకు యూజీసీ నుంచి నిధులు కూడా వస్తాయి. అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సు రద్దు చేయడంతో దీనికి కేటాయించిన ఒక డైరెక్టర్, రెండు ప్రొఫెసర్, రెండు అసోసియేట్, నాలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు రద్దయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. సకాలంలో వర్సిటీ అధికారులు స్పందించకపోతే ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎంఈడీ, స్పెషల్ బీఈడీ కోర్సులు రద్దయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే సుమారు 80 సీట్లను విద్యార్థులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు..

ఏయూలో 1970-71 కాలంలో విద్యా విభాగాన్ని ఏర్పాటుచేశారు. అప్పటి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ లంకపల్లి బుల్లయ్య విద్యా భవన్‌ను ప్రారంభించి ఆ భవనంలోనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటుచేశారు. అంతటి ప్రాధాన్యం కలిగిన ఈ విభాగం ఉన్నతాధికారులు తీసుకున్న ఒక నిర్ణయం వల్ల పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడడం పట్ల సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది.

మల్కాపురం సీఐగా అప్పారావు యాదవ్


సీఐ అప్పారావు యాదవ్

మల్కాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం పోలీసు స్టేషన్ లా అండ్ఆర్డర్ సీఐగా గొలగాని అప్పారావు యాదవ్‌ను నగర పోలీసు కమిషనర్ శంఖ బ్రత బాగ్చి నియమించారు. ఇక్కడ పనిచేసిన ఎస్.విద్యాసాగర్‌ను వీఆర్‌కు అటాచ్‌చేసిన నేపథ్యంలో ఆయన స్థానంలో అప్పారావు యాదవ్‌ను నియమిస్తూ ఆయన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అప్పారావు యాదవ్ గతంలో మల్కాపురం స్టేషన్‌లో క్రైమ్ విభాగంలో ఎస్‌గా పనిచేశారు. ఆయనకు ఈ ప్రాంతంలో పనిచేసే అనుభవం ఉన్నందున సీఐ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వైభవంగా శ్రవణ నక్షత్రం పూజలు


అన్నసంతర్పణకు ఆర్థిక సహాయం చేసిన దంపతులకు జ్ఞాపికలు అందజేస్తున్న దృశ్యం

వేపగుంట, మే 19 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపైనున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా శ్రవణ నక్షత్రం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో 500 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నాయుడుతోట వెంకటసాయినగర్‌కు చెందిన దేవుడు బాబు, పార్వతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు స్వామి జ్ఞాపిక అందజేశారు.

ఆదమరిస్తే అంతే..


శ్రీనగర్-శివసాయి నగర్ కాలనీ రహదారి మధ్యలో గొయ్యి

శ్రీనగర్,మే 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71 వార్డు శ్రీనగర్-శివసాయి నగర్ కాలనీలో రహదారి పక్కన నిర్మించిన మురుగు కాలువలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్డు మధ్యలో కాలువలో గొయ్యి పడడంతో వాహన చోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఆలయాలకు వచ్చే భక్తులు, కర్మాగారాలకు వెళ్లే కార్మికులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో పాదచారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.జీవీఎంసీ అధికారులు సమస్యను పరిష్కరించాలనీ కాలనీ వాసులు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు(తెలుపు)30, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 15, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 44, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240


సరిపల్లి ఆర్వోబీ వద్ద అడ్డదిడ్డంగా వాహనాల రాకపోకలు


యూటర్న్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మల దుస్థితి

ప్రాణాలతో చెలగాటం ఎన్నాళ్లు?

- సరిపల్లి బైపాస్, పినగాడి, రాంపురం ఆర్వోబీల వద్ద దుస్థితి
- నిర్మాణ పనులు పూర్తిలో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం
- అస్తవ్యస్తంగా అనుసంధాన రహదారి
- ప్రమాదాల బారినపడుతున్న వాహన చోదకులు

పెందుర్తి, మే 19 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా ఆనందపురం వరకు 55 కిలోమీటర్ల నేషనల్ ఎక్స్‌ప్రెస్ హైవే సిక్స్‌లైన్ రహదారి విస్తరణ పనులు సరిపల్లి వద్ద అసంపూర్తిగా నిలిచిపోవడంతో వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. ఈ రహదారి ప్రమాదాల జోన్‌గాఉంది. ఈ నేపథ్యంలో 2014లో అప్పటి కేంద్ర ప్రభుత్వం రూ. 2,500 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆరేళ్లలో సిక్స్‌లైన్ల హైవే నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ క్రమంలో రహదారి విస్తరణలో భాగంగా సబ్బవరం సరిహద్దుగా పినగాడి కూడలి నుంచి గొరపల్లి, రాంపురంనుంచి సరిపల్లి మీదుగా గుర్రమ్మపాలెం పీఎస్ఎల్ కంపెనీ వరకు నిర్మించిన బైపాస్ రోడ్డునిర్మించారు. సరిపల్లి వద్ద రోడ్డు వోవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) ఏర్పాటుచేసి ఈ గ్రామాలను కలుపుకుని ఆరులైన్ల రహదారి విస్తరణ చేసి ఆనందపురానికి అనుసంధానం చేశారు.

సరిపల్లి వద్ద రింగ్ రోడ్ మాటేమిటో ..?

ఈ సిక్స్‌లైన్ల రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలో ట్రాఫిక్ తగ్గించడం కోసం వాహనాలు ఆగాల్సిన అవసరం లేకుండా బైపాస్ రోడ్డును అ నుసంధానం చేసి సరిపల్లి వద్ద రింగ్ రోడ్డు నిర్మాణం కోసం ఎన్‌హెచ్ అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. దేశంలో అతిపెద్ద రింగ్ రోడ్డు ఏర్పాటుకానున్నదని సరిపల్లి, పెందుర్తి ప్రాంతాల్లో భూసేకరణ చేశారు. ఈ క్రమంలో సరిపల్లి వద్ద సుమారు 40 ఎకరాల వ్యవసాయ భూములు సేకరించారు. విలువైన పంట భూములు కోల్పోతున్నామని పరిహారం న్యాయసమ్మతంగాలేదంటూ రైతులు భూసేకరణను వ్యతిరేకించారు. దీంతో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన భూములు సర్వే కోసం వచ్చిన ఎన్‌హెచ్ అధికారులకు, రైతుల మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో రైతులు కోర్టును ఆశ్రయించడంతో సరిపల్లి వద్ద రింగ్ రోడ్డు నిలిచిపోయింది. భూసేకరణ ప్రతిపాదించిన భూముల క్రయ, విక్రయాలు జరగకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. సమస్య జటిలం కావడంతో ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోకపోవడంతో అనుసంధాన గ్రామాలు పెందుర్తి రైల్వేట్రాక్ నుంచి సరిపల్లి వరకు ఆరువరసల రహదారి అర్ధాంతరంగా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల వద్ద వాహనాలను మళ్లించాల్సివస్తోంది.

మృత్యుమార్గం

ఆరులైన్ల రహదారి విస్తరణ పనులు పూర్తికాక బైపాస్‌తో సహా మూల మలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు నిర్మాణంలో సరిపల్లి, పినగాడి. రాంపురం వద్ద నిర్మించిన ఫ్లైవోర్ వద్ద అడ్డదిడ్డంగా ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.దీనికితోడు సరిపల్లి బైపాస్ బ్రిడ్జి యూటర్న్ వద్ద సూచిక బోర్డులు లేక వాహనచోదకులు అయోమయానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఈక్రమంలో భారీ రవాణా టారస్ వాహనాలు రాత్రి వేళ యూటర్న్ తీసుకుని బ్రిడ్జి దిగి బైపాస్ రోడ్డు మీదకు వస్తోండటంతో గమనించని కొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్‌హెచ్ అధికారులు ఇప్పటికైనా స్పందించిఆరు వరసల రహదారి ప్రయాణ ప్రమాద రహితంగా చేయాలని పెందుర్తి వాసులు కోరుతున్నారు.

మినీ మహానాడును జయప్రదం చేయాలి

- టీడీపీ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్


మాట్లాడుతున్న ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, మే 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం మినీ మహానాడు నిర్వహించనున్నట్టు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్టీ ప్రతిష్ఠాత్మకంగా కడపలో మహానాడు నిర్వహిస్తుందని, నియోజకవర్గం స్థాయిలో ఇక్కడ మినీ మహానాడు నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు భారీగా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్ ,అప్పారావు, శ్రీనివాస్, సత్యనారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కూర్మన్నపాలెం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో పార్టీ బలోపేతానికి నాయకులు సైనికుల్లా పనిచేయాలని టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లారు సూర్యనారాయణ అన్నారు. మాతృశ్రీ నగర్ పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన వివిధ కమిటీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ పాలనలోప్రజల పక్షాన పోరాడిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానాల్లో ఎంపిక చేసి కమిటీల్లో ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 27 నుంచి కడపలో జరగనున్న మహానాడును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి వేగుంట శ్రీనివాస్, నాయకులు మానాపురం గణపతి, నాగార్జున, జగదీశ్, సుబ్బయ్య, వెంకటేష్, అశోక్, రుక్మిణి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వృత్తి నైపుణ్యాలు అవసరం

మల్కాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే వివిధ రకాల వృత్తి నైపుణ్యాలపై దృష్టి సారించాలని జాతీయ సేవ పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయదేవి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భావ ప్రకటన, వృత్తి విద్య నైపుణ్యాలు, నాయకత్వ లక్ష్యాలను అలవరుచుకోవాలని కోరారు. వీటి వల్ల వ్యక్తిత్వం వికసిస్తుందని, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇవీఎస్ భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, గ్రంథాలయ పాఠకులు, పలువురు బాలలు పాల్గొన్నారు.

బాక్సర్లకు డైట్ అందజేత

మల్కాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ మైదానంలో మైక్‌టైసన్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. ఈసందర్భంగా శిక్షణ పొందుతున్న బాలలకు టీడీపీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ డైట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థీ బాక్సింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపుగా 70 మందికి డైట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాక్సింగ్ క్లబ్ కమిటీ అధ్యక్షుడు మజ్జి రమేశ్, గౌరవాధ్యక్షులు ప్రసాద్‌పాత్రుడు, కార్యదర్శి ఆలీ, కోచ్ కటారి సునీల్, ప్రభు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా కృషి: ఎమ్మెల్సీ గాదె


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసుల నాయుడు

వేపగుంట, మే 19 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ప్రాంతంలో పనిచేస్తున్న మైదాన ప్రాంత ఉపాధ్యాయులకు త్వరలో జరగనున్న బదిలీల్లో తప్పనిసరిగా న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు పేర్కొన్నారు. వేపగుంట హైస్కూల్ సోమవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 2023లో అన్యాయంగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా మాత్రమే న్యాయం జరుగుతుందని, దీని కోసం పీఆర్‌టీయూ పో రాడుతోందన్నారు. ఏజెన్సీలోని పనిచేస్తున్న మైదాన ప్రాంత ఉపా ధ్యాయులకు ఇక్కడ తీసుకురావటమే ధ్యేయంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ ఆడిట్ కమిటీ ఛైర్మెన్ గోపినాద్, విశాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఇతర నాయకులు, మైదాన ప్రాంత టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు

వేపగుంట, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 ఫిర్యాదులు అందాయి. వీటిలో ప్రధానమైనవి 89వ వార్డు వెంకటాపురంలో ఆక్రమ నిర్మాణం నిలుపు చేయాలని, 96 వార్డు గిరిప్రసాద్‌నగర్‌లో యుజీడీ పైపులైన్ సమస్యను పరిష్కరించాలని, సింహపురి లేఅవుట్‌లో డ్రైనేజీ సమస్యను తీర్చాలని, గోశాల జంక్షన్‌లో బస్‌లు నిలుపుదల చేయాలని కోరారు. కాలనీలో పార్కు అభివృద్ధి చేయాలని కోరారు. వీటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కార చర్యలు చేపట్టనున్నట్టు జెడ్సీ కే. హైమావతి తెలిపారు.

ఘనంగా పెంటమాంబ అనుపోత్సవం


పూజలందుకున్న పెంటమాంబ

మల్కాపురం, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిమాచల్‌నగర్‌లో పెంటమాంబ అమ్మవారి అనుపోత్సవం ఘనంగా జరిగింది. ఈనెల 15 నుంచి అమ్మవారి పండగ ప్రారంభమై సోమవారంతో ముగిసింది. ఈసందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. భక్తులకు ప్రసాదంగా చక్కరి పొంగలి, పులిహోర అందజేశారు. సాయంత్రం అమ్మవారి ఉరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో కాంతారా శక్తివేషాలు, కోలాటాలు, కాంగోడ్యాన్స్‌లు, బాణ సంచా ఆకట్టుకున్నాయి. అమ్మవారి ప్రతిమలను అనుపు కార్యక్రమం జరిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ నమ్మి గౌరీశ్వరరావు, ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు ఎస్ఆర్ పురంలో కనకదుర్గ పండగ

పెందుర్తి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఆర్‌పురంలో కనకదుర్గ పండగ మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు తెలిపారు.ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు అభిషేకాలు, అలంకరణ నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం చేపట్టనునున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్టు ఎర్రిబాబు తెలిపారు.

నేడు బుచ్చిరాజుపాలెంలో బంగారమ్మ పండగ


బంగారమ్మ

ఎన్.ఎ.డి.జంక్షన్: బుచ్చిరాజుపాలెం పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవత బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రధాన పండుగ నిర్వహించనునున్నట్లు త్రివేణి గ్రామాభ్యుదయ సేవా సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బీఆర్‌టీఎస్ రోడ్డు విద్యుత్ కాంతులతో తీర్చిదిద్దారు. ఈ పండుగ పురస్కరించుకుని గత వారం రోజుల నుంచి అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్నారు. ప్రధాన పండుగకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వెంకటేశ్వరునికి అభిషేకాలు


వెంకటేశ్వర స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వవార్డు గరుడాద్రిపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామికి సోమవారం పంచామృతాభిషేకాలు జరిగాయి. స్వామివారి జన్మనక్షం సందర్భంగా స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పరిసరకాలనీల భక్తులు పాల్గొన్నారు. ఆలయకమిటీ ఛైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ముద్రించిన ధరకే వస్తువు విక్రయించాలి

- తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్యాకెట్లపై ముద్రించిన ధరకే వస్తువులు విక్రయించాలని, అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్ హెచ్చరించారు. ఈ నెల 20న వరల్డ్ మెట్రాలజీ డే పురస్కరించుకుని సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని దుకాణదారులు, ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపులో విక్రయించే ప్రతి వస్తువుపై తేదీ, ధర ఉండాలన్నారు. అదనంగా వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో వ్యాపారులు పారదర్శకత పాటించాలని సూచించారు. ప్యాకింగ్ ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ తరహా ఫిర్యాదులు వచ్చే దుకాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. వినియోగదారులు కూడా అదనంగా వసూలు చేసే వారిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ అప్పలరాజు, సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- ఒకరు సచివాలయ ఉద్యోగి - విధులకు వెళుతుండగా ఘటన


సచివాలయ ఉద్యోగి కార్తిక్‌ప్రసాద్


మనోజ్‌కుమార్ (ఫైల్ ఫొటోలు)

పెదబయలు, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కొల్లి రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన జర్సింగి కార్తీక్ ప్రసాద్ (30) పర్రెడా సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తు న్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి వద్ద భోజనం చేసి బైక్‌పై విధులకు హాజరయ్యేందుకు బయలు దేరాడు. అతనికి తోడుగా వరుసకు అల్లుడైన బొండా మనోజ్‌కుమార్ (21) కూడా వెళ్లాడు. అడుగులపుట్టు పంచాయతీ కొత్తపుట్టు వంతెన సమీపాన బైక్ అదుపుతప్పి బూరుగుచెట్టును బలంగా ఢీకొని లోయలో పడిపోయింది. పెద్ద శబ్దం రావడంతో సమీపంలోని దుకాణ యజమాని గమనించి గ్రామస్థుల సహాయంతో వారిద్దరినీ బయటకు తీశారు. అప్పటికే మనోజ్‌కుమార్ మృతిచెందాడు. కార్తీక్ ప్రసాద్ కొన ఊపిరితో ఉండడంతో స్థానికులు అంబులెన్స్‌లో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికి త్స పొందుతూ అతను మృతిచెందాడు. కాగా కార్తీక్ ప్రసాద్ తండ్రి రాజుబాబు విశాఖపట్నంలోని గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ (క్రైమ్)గా పనిచేస్తున్నారు. మనోజ్‌కుమార్ తండ్రి సదాశివరావు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అందివచ్చిన కుమారులు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం,

అగనంపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బ్రహ్మకుమారీస్ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలోని దివ్య జ్యోతి భవనంలో ఏప్లస్ ఆస్పత్రి సౌజన్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బ్రహ్మకుమారీస్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ బీకే. సోమేశ్వరి తొలిత శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉక్కు నిర్వాసిత గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఒత్తిడి నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బీకే. రామకోటి, స్థానిక నాయకులు బి. సత్యనారాయణ, హనుమంతురావు, గంతకోరు అప్పారావు, మొల్లి కోటి, తాతారావు, వరహాలు, తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలిగా హనిత


నియమితులైన గల్లా హనిత, పెంటయ్య

అగనంపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలిగా గల్లవానిపాలేనకు చెందిన గల్లా హనిత నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ జిల్లా అధిష్ఠానంనుంచి ఉత్తర్వులు వచ్చాయి. తనకి పదవి రావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లకు హనిత కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.

75వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పెంటయ్య

గాజువాక: జీవీఎంసీ 75వ వార్డు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ములకపల్లి పెంటయ్య నియమితులయ్యారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి పెంటయ్య ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మరింత బలోపేతం కృషి చేస్తానన్నారు.

వ్యాస రచన పోటీలు


వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదగంట్యాడ, మే 19 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పెదగంట్యాడ, నడుపూరు, నెల్లిముక్కు పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. విజేతలకు వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి: సీపీఐ


పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు పేదలకు గ్రామీణ, పట్టణ ప్రాంతంలో రెండు, మూడు సెంట్ల మేర స్థలం ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలు ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారంస్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాసరావు, ఎర్రిపల్లి రాంబాబు మాట్లాడుతూ .కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా ఇప్పటివరకు పేదల ఇళ్ల స్థలాలపై ప్రకటన చేయలేదని ఆరోపించారు. అనంతరం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కి వినితిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసిరినాయుడు, అరుణ, రాము,రమణ, రజనీ, దుర్గారావు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: పట్టణప్రాంతాల పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు సోమవారం పెదగంట్యాడ మండల కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా పేదలకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. నాయకులు అచ్యుత్‌రావు, జి ఆనంద్, పి దుర్గారావు, కె పోతన్న, యెల్లేటి శ్రీనివాసరావు, పల్లేటి పోలయ్య, పిల్లా పద్మ, టిడ్కో గృహ లబ్ధిదారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.


పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

ముగిసిన వేసవి శిక్షణ

గాజువాక, మే 19 (ఆంధ్రజ్యోతి): గాజువాక అఫిషియల్ కాలనీలోని డిజైర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ సోమవారంతో ముగిసింది. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్ఐవీ బాధిత పిల్లలను అక్కున చేర్చుకొని వీరికి ఉచి తంగా విద్యను అందించటం మంచి విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

మల్కాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో పలుచోట్ల కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సోమవారం జరిగాయి. ఈసందర్భంగా సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడన జగ్గునాయుడు పాల్గొని ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ యన మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి సుందరయ్య కృషి చేశారన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షణకు పాటుపడ్డారన్నారు. పార్లమెంట్‌లో మొదటి ప్రతిపక్ష నాయకుడిగా రాణించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

25న జేసీఐ జోన్ 4 మిడ్కాన్ చైతన్య సదస్సు

డాబాగార్డెన్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న సాయిప్రియా రిసార్ట్‌లో జేసీఐ జోన్ 4, రీజియన్ సీ సంయుక్త ఆధ్వర్యంలో 'మిడ్కాన్ చైతన్యం' పేరిట సదస్సు నిర్వహించనున్నట్లు జేసీఐ జోన్ వైస్ ప్రెసిడెంట్ చైతన్య, వైజాగ్ అచీవర్స్ ప్రెసిడెంట్ సోమశేఖర్, సదస్సు డైరెక్టర్ శీతల్ తెలియజేశారు. సోమవారం డాబాగార్డెన్స్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సామాజిక బాధ్యత, వ్యక్తిత్వ, సంస్థాగత అభివృద్ధిపై అనుభవజ్ఞులతో యువతకు దిశానిర్దేశం చేస్తామన్నారు.

బుద్ధుని బోధనలపై 24న సదస్సు

డాబాగార్డెన్స్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో 'బుద్ధుని బోధనలు-ప్రపంచ శాంతి' అనే అంశంపై ఈ నెల 24న సదస్సు నిర్వహిస్తున్నట్టు ఐఏఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు తెలిపారు. బుద్ధుని 2569వ జయంతి పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 10 గంటలకు డా.ఎల్.బి.కాలేజీ ఆవరణలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సులో ప్రముఖ బుద్ధిస్ట్ పరిశోధకుడు డా.మాటూరి శ్రీనివాసరావు ప్రసంగిస్తారన్నారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

పారిశుధ్య కార్మికుల పనితీరుపై ఆరా



పారిశుధ్య కార్మికులను ప్రశ్నిస్తున్న జడ్సీ మల్లయ్యనాయుడు

అల్లిపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-4 పరిధిలోని కొబ్బరితోట, ఎస్వీపీ నగర్, బౌరాడ రోడ్డు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల పనితీరు, చెత్త తరలింపు తదితర విషయాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చాలామంది కాలువల్లో చెత్తను వేయడం గమనించిన జడ్సీ వారికి అవగాహన కల్పించారు. అలానే రోజూ శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు, సామగ్రి వేయొద్దని ప్రజలకు సూచించారు.

వృద్ధుడికి ఆశ్రయం

అక్కయ్యపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు చెందిన కె.రాము(75) అనే వృద్ధుడికి ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

పిల్లల పార్కు ..ఏదీ ఆ 'మార్కు'



ఆర్కే బీచ్‌లో నిర్లక్ష్యానికి గురైన పిల్లల పార్కు ముఖద్వారం



ధ్వంసమైన ఆట వస్తువులు, పడిపోయిన రక్షణ గోడ

మహారాణిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): అందమైన ఏనుగు బొమ్మలు, ఊయల, చక్కని ఆటబొమ్మలు, వాటర్ ఫౌంటెన్, ఆట పరికరాలు, ఆహ్లాదం పంచే మరికొన్ని.. ఇవన్నీ రామకృష్ణ బీచ్‌కు చిన్నారులను రా..రమ్మనేవి. ఇప్పుడు ఈ ప్రాంతం బోసిపోయింది. ఒకప్పుడు విశాఖ సాగర తీరంలో అందమైన లోకేషన్ అంటే ఆర్ కే బీచ్ పేరు టక్కున చెప్పేవారు. సువిశాలమైన సముద్ర తీరంతో పాటు పిల్లలు ఆడుకునేందుకు అందమైన పార్కు ఉండేది. పిల్లల మానసిక వికాసానికి ఈ పార్కు ఎంతగానో ఉపయోగపడేది. అంచేత సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలతో ఇక్కడకు వచ్చేవారు. పెద్దలు సాగర కెరటాలు, అందమైన సముద్రతీరాన్ని చూసి మనసు పారేసుకుంటే, పిల్లలు ఈ పార్కులో ఆడుకుంటూ ఆనందంగా గడిపేవారు. ఈ పార్కుకు దశాబ్దాల చరిత్ర ఉంది. దీన్ని చూశాకే బీచ్ రోడ్డులో మిగిలిన పార్కులు ఏర్పాటయ్యాయి. అలాంటి పార్కు పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. పార్కులో పిల్లలు ఆడుకునే బొమ్మలన్నీ ధ్వంసమయ్యాయి. ఆట పరికరమే లేకుండాపోయింది. సుమారు ఆరు నెలల క్రితం సముద్రపు అలలకు పార్కు రక్షణ గోడ సైతం ధ్వంసమైనా, జీవీఎంసీ అధికారులు అలాగే వదిలేశారు. దీన్ని పట్టించుకోవటం మానేశారు. దీనికి ఎదురుగా ఉండే ఒక హోటల్ యాజమాన్యం తమ హోటల్ ఎదురుగా వ్యూ పాయింట్ అందంగా కనిపించాలని ఆశించి కొన్ని రోజుల పాటు ఆ పార్కు నిర్వహణ బాధ్యతలు చూసేవారు. ఇప్పుడు వారు కూడా వదిలేయటంతో పార్కు మరింత అధ్వానంగా తయారైంది. ఇప్పుడు పిల్లలను పార్కు లోపలకు పంపాలంటే పెద్దలు భయపడే పరిస్థితి నెలకొంది. రక్షణ గోడ లేకపోవటం, కింద పడిపోతారన్న భయం, పిల్లలకు కనీసం ఒక్క ఆట వస్తువు లేకపోవటంతో ఆనందం ఆవిరయ్యింది. పిల్లలు, పెద్దల రాక, చిరు వ్యాపారాలతో కళకళలాడే ఈ పార్కు ఇప్పుడు నిస్తేజంగా కనిపిస్తోంది. పార్కుకు పూర్వ వైభవం తెచ్చేలా అధికారులు చొరవ చూపాలని సందర్శకులు కోరుతున్నారు.

ఘనంగా కుంచుమాంబ, పరదేశమ్మ తొలేళ్లు



అమ్మవారి ప్రతిమలను ఊరేగిస్తున్న భక్తులు

కంచరపాలెం, మే 19(ఆంధ్రజ్యోతి): రెడ్డి కంచరపాలెం గ్రామ దేవత శ్రీ కుంచుమాంబ అమ్మవారి తొలేళ్ల సోమవారం ఘనంగా జరిగింది. గ్రామ సంప్రదాయం ప్రకారం అమ్మవారి ప్రతిమలను భక్తులు ఆర్పీపేటలలో పైడిమాంబ అమ్మవారి ఆలయం దగ్గర నుంచి తలపై మోసుకుంటు గ్రామంలో ఉన్న పుట్టబంగారం గుడిదగ్గరకు తీసుకువెళ్లారు. పుట్టబంగారం గుడిలోని, స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ప్రతిమలను భక్తులు వారి ఇళ్లల్లోకి తీసుకెళ్లి మంగళవారం ప్రధాన పండగ కారణంగా తుమ్మడిపాలెంలో కుంచుమాంబ ఆలయానికి తీసుకువస్తారు. అమ్మవారి తొలేళ్ల సందర్భంగా గ్రామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అక్కయ్యపాలెంలో

అక్కయ్యపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలో వేంచేసిన పరదేశమ్మ అమ్మవారి తొలేళ్ళ సోమవారం ఘనంగా జరిగింది. ఈ మేరకు భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ప్రతిమను ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఆళ్ళ లీలావతి శ్రీనివాస్, ఆలయ కమిటీ, స్థానిక నాయకులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.



పరదేశమ్మ ప్రతిమ వద్ద కార్పొరేటర్ లీలావతి తదితరులు

నేటి నుంచి హనుమాన్ జయంతి ఉత్సవాలు

మురళీనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలోని ప్రసిద్ధ హనుమాన్ ఆలయంగా విరాజిల్లుతున్న సూర్యానగర్ శ్రీ యోగసిద్ధాంజనేయ ఆలయంలో మంగళ, బుధ, గురువారాల్లో వార్షిక హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు తెలిపారు.

ఉత్సవంలో నిర్వహించే కార్యక్రమాలు

ఉత్సవాలు శ్రీ పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో అర్చకుడు శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రారంభమవుతాయని సుబ్బరాజు చెప్పారు. ఉదయం 6 నుంచి 12 వరకు స్వామి వారి దర్శనం, అర్చన, అగ్ని ప్రతిష్ఠ పాటు సాయంత్రం అష్టోత్తర శతకలశ ఆరాధన చేస్తామన్నారు. రెండో రోజు వేడుకల్లో 108 కలశములతో స్వామివారికి అభిషేకం, సాయంత్రం ఆలయంలో సుందరాకాండ పారాయణం నిర్వహిస్తామన్నారు. ఆఖరిరోజు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హనుమంతుడు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, సీతారాముల కల్యాణం జరిపిస్తామని, స్వామికి సిందూర అర్చనలు జరుగుతాయని ఆయన చెప్పారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

సీపీఐ నాయకుల వినతి



సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సీతమ్మధార, మే 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లలో ఇల్లు నిర్మించుకునే ప్రతి వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టిన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారని గుర్తుచేశారు. సూపర్ సిక్స్ ప్రణాళికలో పెట్టిన ఈ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు కూడా పూర్తి చేసి ఆశావహులకు కేటాయించాలని కోరారు. దీనికి సంబంధించిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రమేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వేదిక..మహానాడు

టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జి



టీడీపీ ఉత్తర నియోజకవర్గ మహానాడులో ప్రసంగిస్తున్న గండి బాబ్జి, వేదికపై ఇతర నాయకులు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు మహానాడు గొప్ప వేదికని తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జి అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విశాఖ ఉత్తర నియోజకవర్గం మినీమహానాడులో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ హయాం నుంచి పార్టీ మహానాడును క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడులు నిర్వహించి, ప్రజల సమస్యలను కార్యకర్తల ద్వారా తెలుసుకుని వాటిని పార్టీ అధిష్ఠానానికి పంపిస్తామని చెప్పారు. వార్డుస్థాయిలో నాయకులు సచివాలయాలకు వెళ్లి ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని బాబ్జి పిలుపునిచ్చారు. పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, కార్యదర్శి లొడగల కృష్ణ, నాయకులు వెల్లంకి భరత్, గొంప సత్యనారాయణ, ఫైలా ముత్యాలనాయుడు, బొడ్డేటి మోహనరావు, రాజమండ్రి నారాయణ, ఈతలపాక సుజాత, అనసూరి మధు, సనపల వరప్రసాద్, కోయిలాడ వెంకట్, కోట నరేష్, ఆకిరెడ్డి జగదీష్, జాన్, ఎన్.అప్పారావు, పుట్టా కార్తీక్, గొంప ధర్మారావు, నమ్మి రవికుమార్, బొడ్డేపల్లి లలిత, మూల అప్పారావు, జనార్దన్, సనపల కీర్తి, అప్పన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ప్రభుత్వ భూమిలో అనధికార కట్టడాల నిలిపివేత

వీఆర్వోల ఫిర్యాదుకు స్పందించిన తహసీల్దార్



కళింగనగర్ 25/3 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో తీసిన పునాదులు

మాధవధార, మే 19 (ఆంధ్రజ్యోతి): మాధవధార సర్వే నెంబరు 13 ఉడాకాలనీ మెయిన్‌రోడ్డులో ఉన్న 300 గజాల ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి, పక్కనే ఉన్న ఉడా హెచ్చరిక బోర్డుల్ని తొలగించిన విషయమై స్థానిక వీఆర్వోలు తహసీల్దార్ రమేశ్ దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం నిర్మాణ పనులను నిలిపివేశారు. ఆ భూమి తనదంటూ ఓ వ్యక్తి వచ్చినా, అతని దగ్గర ఎలాంటి పత్రాలు లేవు. ఈ విషయమై తహసీల్దార్, వీఎంఆర్డీఏ కార్యాలయాలకు అందిన ఫిర్యాదులు పరిశీలిస్తున్నారు. కళింగనగర్‌లోని 25/3 సర్వే నెంబరులో ఉన్న మరో 100 గజాల స్థలంపై స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారి కన్ను పడింది. ఎలాంటి ప్లాన్, జీవీఎంసీ నిర్మాణ అనుమతులు లేకుండా తమ వారసత్వ స్థలమని చెప్పి భవన నిర్మాణానికి తెరతీశారు. దీనిపై స్థానిక 289వ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి లక్ష్మణ్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పవన్ ప్రదేశాన్ని పరిశీలించి, అది ప్రభుత్వ స్థలంగా నిర్ధారించుకుని, అక్కడ జరుగుతున్న నిర్మాణాన్ని నిలిపివేశారు.

పీజీఆర్ఎస్‌కు ఏడు వినతులు



మహిళ చెబుతున్న సమస్యను వింటున్న జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము

జ్ఞానాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులు సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాలుగు వినతులు స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 50వవార్డుకు చెందిన రెయ్యి వెంకట్రావు రెండు ఫిర్యాదులు చేశారు. సాకేతపురంలో నీటి సరఫరా, నీటి చార్జీల పెంపు విషయమై నిస్తాల కృష్ణారావు ఫిర్యాదు చేశారు. 41వ వార్డులోని జ్ఞానాపురం ప్రాంతంలో సెబాస్టియన్ కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పరిష్కరించాలని నొడగల రాజేష్ బాలకృష్ణ పబ్లిక్ హెల్త్ విభాగానికి ఫిర్యాదు చేశారు. అర్జీలు స్వీకరించిన జడ్సీ సంబంధిత అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. ఈఈ ప్రసన్న, ఈఈ దిలీప్, ఏపీడీ పుణ్యవతి, కృపానందం, ఆర్ఓలు బాబురావు, రాజ్యలక్ష్మి, టీపీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చొరవ చూపాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. సూర్యాబాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలను జోనల్ కమిషనర్ స్వీకరించి వారి సమస్యలను సావధానంగా విన్నారు. రెవెన్యూ విభాగానికి 2, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు అందినట్లు ఆయన తెలిపారు.

జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ విజేతలు వీరే



టేబుల్ టెన్నిస్ టోర్నీలో విజేతలతో అతిథులు

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీలో 108 క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఎంవీపీకాలనీ, జీవీఎంసీ ఎస్-3 స్పోర్ట్స్ ఎరీనాలో జరిగిన ముగింపు కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ డీవీఎస్‌వై. శర్మ, డాక్టర్ సార్వభౌమ, శ్రీకృష్ణమూర్తి, పీవీఎన్.సూర్యారావు అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. కోచ్‌లు అచ్యుత్, మురళి,కన్నబాబు పాల్గొన్నారు. అండర్-9 బాలికల విభాగంలో టి.హర్షిత, బి.ఈష కామేశ్వరి, బాలురలో అభినవ్, వై.పృథ్వీ; అండర్-11 బాలికలలో శ్రీయానిక, ఎన్.వైష్ణవి ధృతి, బాలురలో దివ్యం సోలంకి, జి.విషంక్; అండర్-13 బాలురలో కె.సాయి శ్రావణ్, ఎన్.కార్తిక్; అండర్-15 బాలికలలో టి.శన్విక, ఎస్‌కె.ఆరిఫా సుల్తానా, బాలురలో ఎన్.మోక్షజ్ఞ, బాలాజి; అండర్-17 బాలికలలో ఎస్‌కె.ఆరిఫా సుల్తానా, డి.దీక్షిత, బాలురలో ఎన్.మోక్షజ్ఞ తేజ, యు.జాన్‌వెస్లీ విజేతలుగా నిలిచారు. సీనియర్ మహిళలు, పురుషుల విభాగంలోనూ పోటీలు జరిగాయి.

ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు కుట్ర

సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆరోపణ



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

ఉక్కుటౌన్‌షిప్ (విశాఖపట్నం), మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు అప్పగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీఐటీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆరోపించారు. స్టీల్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికులు మంగళవారం నుంచి సమ్మె చేపట్టనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం కర్మాగారం గేటు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంటును పరిరక్షించేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం వెనక్కి తగ్గాలని, లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రం దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆరోపించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ఉద్యోగుల సమస్యలపై పోరాటాలు చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, పీవీ రమణమూర్తి, యు.రామస్వామి, వైటి. దాసు, జి.గణపతిరెడ్డి, సీఐటీయూ నాయకులు జగ్గునాయుడు, ఆర్ఎస్వీ కుమార్, అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న అన్నవరం దేవస్థానం ఈఓ

సింహాచలం, మే 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని తూర్పుగోదావరి జిల్లా అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం ఈఓ సుబ్బారావు సతీసమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ ఏఈఓ ఆనందకుమార్ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభం ఆలింగనం తరువాత అంతరాలయంలో అర్చకులు పూజలు చేయగా, గోదాదేవి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

టీచర్ల బదిలీలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. దీంతో వారందరికీ తప్పనిసరిగా బదిలీ జరగనున్నది. అలాగే పదవీ విరమణ, పదోన్నతి పొందిన, మరణించిన లేదా ఇతర కారణాల వల్ల 780 ఖాళీలు న్నట్టు గుర్తించారు. త్వరలో జరగనున్న బదిలీల్లో ఆ 780 పోస్టులను భర్తీచేస్తారు. దీర్ఘకాలిక సెలవుపై విదేశాలకు వెళ్లిన టీచర్లు ఐదుగురు, స్టడీ లీవ్‌పై వెళ్లిన 51 మంది, విధులకు గైర్హాజరైన టీచర్లు ముగ్గురి స్థానాలను కూడా బదిలీల ద్వారా భర్తీ చేస్తారు. కాగా ఎంతమందికి స్థానచలనం కలుగుతుందన్న దానిపై ఇప్పటికే నివేదిక రూపొందించామని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మొత్తం 4,811మంది టీచర్లకు స్థాన చలనం కలుగుతుందన్నారు.

షర్మిల వ్యవహారశైలితో పార్టీ నిర్వీర్యం

(5వ పేజీ తరువాయి)

ఇదే విషయాన్ని తనకు తెలియజేశారన్నారు. పార్టీ పెద్దలతో తనకు ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడి పరిస్థితులను తెలియజేయాలని పలువురు కోరారన్నారు. ఈ విషయాలను పార్టీ అధ్యక్షుడు ఖర్గేతోపాటు అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ఆమె వివరించారు. పార్టీని బలోపేతం చేసేందుకు షర్మిల చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి పార్టీలో ఉన్న నాయకులతో మాట్లాడేందుకు కూడా ఆమె ప్రయత్నించడం లేదని, అనేక జిల్లాల్లో సీనియర్ నేతలకు తెలియకుండానే కీలక బాధ్యతల నుంచి తప్పించినట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, కడప జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు శ్రీరాములు, జిల్లా నాయకులు రుత్తల శ్రీరామమూర్తి, గుత్తుల శ్రీనివాస్, మాజీ డీసీసీ ప్రెసిడెంట్ అన్నాజీ, దొమ్మేటి రమణరావు, సుజాత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహా ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

సీల్డ్ కవర్‌లో దల్లి గోవిందరెడ్డి పేరు ఉన్నందున ఆయన్నే డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా వంశీకృష్ణ ప్రకటించారు. దీంతో డిప్యూటీ మేయర్ పదవిని ఆశించిన టీడీపీకి చెందిన యాదవ, కాపు సామాజిక వర్గాలకు చెందిన 15 మంది కార్పొరేటర్లు ఎన్నికను బహిష్కరిస్తున్నామని చెప్పి జీవీఎంసీ కౌన్సిల్ హాల్‌కు వెళ్లకుండా బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌కు వెళ్లిపోయారు.

కోరం లేకపోవడంతో నేటికి వాయిదా

కోరం లేకపోవడంతో డిప్యూటీ మేయర్ ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారి హోదాలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రకటించారు. జీవీఎంసీలో 97 మంది కార్పొరేటర్లు, 14 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు మొత్తం 111 మంది ఓటు హక్కు కలిగిన సభ్యులు ఉన్నారు. వీరిలో సగం మంది సభ్యులు అంటే 56 మంది సమావేశానికి హాజరుకావాల్సి ఉంటుంది. కానీ ఏడుగురు ఎమ్మెల్యేలు (వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు), ఒక ఎమ్మెల్సీ (వేపాడ చిరంజీవిరావు)తోపాటు 48 మంది కార్పొరేటర్లు మొత్తం 54 మంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం కాగా, 12 గంటలకు కూడా కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ప్రకటించారు.

ఏయూలో విద్యా విభాగం మనుగడ ప్రశ్నార్థకం

(5వ పేజీ తరువాయి)

భవంతిలోకి వెళ్లాలని సూచించారు. దాంతో విభాగానికి చెందిన ఫ్యాకల్టీ, సిబ్బంది అత్యవసరంగా విద్యా విభాగాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. తాత్కాలికంగా అన్నారు కాబట్టి మళ్లీ విభాగాన్ని అక్కడకు మార్చుతారేమోనని అనుకున్నారు. కానీ, ఏళ్లు గడుస్తున్నా అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కోర్సుల నిర్వహణకు ఇబ్బందిగా ఉందని, ఆ భవనాన్ని తమకు కేటాయించాలని కోరినా అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు...చివరకు ఆ విభాగంలో నిర్వహించే కోర్సులు రద్దు చేసే పరిస్థితి వచ్చింది. సాధారణంగా ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో నిర్వహించే బీఈడీ (అంధుల కోసం) స్పెషల్ కోర్సుకు రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ) అనుమతి ఇస్తుంది. అలాగే, ఎంఈడీ కోర్సు నిర్వహించాలంటే నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) అనుమతి అవసరం. ఈ కోర్సుల నిర్వహణకు ఆయా సంస్థలు అనుమతి ఇవ్వాలంటే తప్పనిసరిగా విభాగానికి సంబంధించిన వివరాలను అందించాలి. క్లాస్ రూమ్స్, సెమినార్ హాల్స్, లైబ్రరీ, ఫ్యాకల్టీ రూమ్‌లకు సంబంధించిన సమాచారం మెజర్‌మెంట్ ప్రకారం అందించాలి. ఆయా ఫొటోలను జియో ట్యాగింగ్ చేసి పంపించాలి. అప్పుడే ఏటా కోర్సుల నిర్వహణకు అనుమతి లభిస్తుంది. గడిచిన రెండేళ్లుగా విద్యా భవన్‌లోని వివరాలనే విభాగానికి చెందిన అధికారులు ఆయా సంస్థలకు అందిస్తున్నారు. ఈ ఏడాది తనిఖీలకు వచ్చే అవకాశం ఉండడంతో ఫ్యాకల్టీలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం హెచ్‌ఆర్ఎం విభాగంలో నిర్వహిస్తున్న గదులు, ఫ్యాకల్టీ రూములు, ఇతర సదుపాయాలను చూస్తే కోర్సుల నిర్వహణను ఆయా సంస్థలు ఉపసంహరించుకునే ప్రమాదం ఉందని, అదే జరిగితే పదుల సంఖ్యలో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడల్ట్ ఎడ్యుకేషన్ రద్దు..

ఎడ్యుకేషన్ విభాగంలో నిర్వహించే మూడు కోర్సుల్లో ఒకటైన అడల్ట్ ఎడ్యుకేషన్‌ను మాజీ వీసీ ప్రసాదరెడ్డి 2022-23 విద్యా సంవత్సరంలో రద్దు చేశారు. వసతి లేదన్న కారణాన్ని చూపించి కోర్సు రద్దు చేశారు. 30 సీట్లతో నడిచే ఈ కోర్సును రద్దు కావడంతో ఎంతోమందికి అన్యాయం జరిగింది. ఈ కోర్సు నిర్వహణకు యూజీసీ నుంచి నిధులు కూడా వస్తాయి. అడల్ట్ ఎడ్యుకేషన్ కోర్సు రద్దు చేయడంతో దీనికి కేటాయించిన ఒక డైరెక్టర్, రెండు ప్రొఫెసర్, రెండు అసోసియేట్, నాలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు రద్దయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. సకాలంలో వర్సిటీ అధికారులు స్పందించకపోతే ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎంఈడీ, స్పెషల్ బీఈడీ కోర్సులు రద్దయ్యే అవకాశం ఉంది. అదే జరిగితే సుమారు 80 సీట్లను విద్యార్థులు నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు..

ఏయూలో 1970-71 కాలంలో విద్యా విభాగాన్ని ఏర్పాటుచేశారు. అప్పటి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ లంకపల్లి బుల్లయ్య విద్యా భవన్‌ను ప్రారంభించి ఆ భవనంలోనే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటుచేశారు. అంతటి ప్రాధాన్యం కలిగిన ఈ విభాగం ఉన్నతాధికారులు తీసుకున్న ఒక నిర్ణయం వల్ల పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడడం పట్ల సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆరిలోవ, మే 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని డీఈఓ ఎస్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 1031 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 817 మంది హాజరైనట్టు తెలిపారు. స్క్వాడ్ బృందాలు 29 కేంద్రాలను సందర్శించాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని చెప్పారు. అలాగే ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు తొలి రోజు ప్రశాంతంగా జరిగాయి. తొమ్మిది కేంద్రాల్లో హిందీ పరీక్ష జరగ్గా 34 మంది విద్యార్థులకు 29 మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్‌కు సంబంధించి ఇంగ్లీష్ పరీక్ష ఐదు నిర్వహించగా 119 మందికి 98 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె పంపిణీ

పెదవాల్తేరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరు ప్రజా ఆరోగ్య కేంద్రం వద్ద సుమారు 80 మంది పారిశుధ్య కార్మికులకు టీడీపీ 21వ వార్డు ఇన్‌చార్జి పీతల అవినాష్, గోవింద్ రాజు సోమవారం సబ్బులు, కొబ్బరినూనె అందజేశారు. ఏడాదికి గాను ఒక్కొక్కరికి నాలుగు కిలోల కొబ్బరి నూనె, 12 సబ్బులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రఫీ, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు డిజిటల్ విద్యపై శిక్షణ

రామ్‌నగర్, మే 19 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఏఐ ఆధారిత డిజిటల్ విద్యలో శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమని నాస్కామ్ ఫౌండేషన్ ప్రతినిధి జ్యోతి శర్మ అన్నారు. ఏఐ ఫర్ స్కిలింగ్ ద్వారా డిజిటల్ విద్యలో శిక్షణ పొందిన 700 మందికి సోమవారం ఆయన దసపల్లా హిల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో కృత్రిమ మేధపై నైపుణ్యం ఉన్న వారికి డిమాండ్ పెరుగుతుందని, ఈమేరకు పేదరికంలో ఉన్న యువత సమగ్ర అభివృద్ధి కోసం జనరేటివ్ ఏఐ రోబోటిక్ కోర్ వర్క్ స్కిల్స్ తదితర రంగాల్లో నైపుణ్యతతో కూడిన శిక్షణ అందిస్తున్నామన్నారు.

యాతవాని చెరువు అన్యాక్రాంతంపై ఫిర్యాదు

పద్మనాభం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపురంలో యాతవాని చెరువు ఆక్రమణలను నిలువరించి చెరువులో ఉపాధి పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. సోమవారం వారు ఎంపీడీఓ విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో సర్వే నెంబరు 73-2లోని సుమారు 50 ఎకరాలకు సాగునీరు అందించే చెరువును కాజేయడానికి ఎప్పటి నుండో ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి నిలువరించామన్నారు. ఈ ఏడాది ఉపాధి పనులు చేపడుతుండగా కొందరు ఈ చెరువులో తమ భూమి ఉందని పనులు చేపట్టకుండా నిరోధించారన్నారు. కాగా ఎంపీడీఓ చెరువును పరిశీలించారు. రైతుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. ఉపాధి పనులను ప్రారంభిస్తామని వారికి హామీ ఇచ్చారు.

సినిమా గైడ్

- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్-3** :సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచర పాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 15, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 15, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 56, అల్లం (పాతది)50, బరబాటి 22, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 80,బద్దచిక్కుడు 44, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 32, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 36, కంద 74, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండ ఉసిరి 90, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	545
విజయనగరం	549
శ్రీకాకుళం	549

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

చెరువు చేపలకు గిరాకీ

- సముద్రంలో వేట నిషేధంతో పెరిగిన డిమాండ్
- ప్రతి వారం కిటకిటలాడుతున్న మార్కెట్లు

వెంకోజీపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : సముద్రంలో చేపల వేట నిషేధంతో చెరువు చేపలకు డిమాండ్ నెలకొంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులపాటు చేపల పునరుత్పత్తి సీజన్ నేపథ్యంలో సముద్రంలో వేట నిషేధం అమలువుతోంది. ఇది పూర్తయి మార్కెట్లకు చేపలు చేరడానికి ఇంకో నెలరోజుల పైగా సమయం ఉంది. దీంతో బజార్లలో చెరువు చేపల వ్యాపారమే కీలకంగా మారింది.హెచ్‌బీ కాలనీ, పరిసర ప్రాంతాల్లోని చేపల బజార్లలో టన్నుల కొద్దీ చేపల విక్రయం ఉంటుంది. ప్రస్తుతం చెరువు చేపలకు డిమాండ్ పెరిగింది. లక్షలాది మంది జనాభా నివసించే నగరంలో చేపల వినియోగం అధికమే. సముద్రం చేపలు తక్కువ ధరకు లభ్యమవుతుంటాయి. దీంతో మాంసాహార ప్రియులు చెరువు చేపలపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల చెరువుల నుంచి చేపలు దిగుమతి అవుతున్నాయి. ప్రధానంగా ఆదివారం, మంగళవారం, బుధవారాల్లో వీటికి గిరాకీ ఉంటోంది. సాధారణంగా ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి చేపలు దిగుమతి అవుతుంటాయి. ఇటీవల ఉత్త రాంధ్రలోని చెరువు చేపలకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌తో పాటు, తగరపువలస, ఆనందపురం, దేవరాపల్లి, ఎస్. కోట ప్రాంతాల్లోని చెరువులతో పాటు ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని చెరువుల్లో సహజసిద్ధంగా పెరిగిన చేపలకు నగరంలో మంచి డిమాండ్ ఉంది. ఎండలకు చెరువుల్లో నీరు ఇంకిపోతుండడంతో చేపలు పట్టి తరలిస్తుంటారు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చే చేపల లోడ్‌లు రాంపురం వద్ద గల హోల్‌సేల్ మార్కెట్ యార్డ్‌కు చేరి నగరంలోని రిటైల్ మార్కెట్‌కు వస్తాయి.



ధరలు ఇలా...

ప్రస్తుతం బంగారుపాప, బొచ్చు, శీలావతి, జడ్డువ, చందువ రకాలు, సైజును బట్టి ధర పలుకుతోంది. కిలోకి తక్కువగా ఉన్న చేపలకు ఓ రేటు, ఎక్కువ బరువు గల చేపలకు ఓ ధర నిర్ణయిస్తారు. మొత్తం మీద కిలో చేపలు రూ.160 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. వీటితో పాటు డామ్ చేపలు కొరమేను, గొరస తదితర బతికిన ఉన్న చేపలకు మరింత ఎక్కువగా డిమాండ్ ఉంది.



దుకాణాల వద్ద కొనుగోలుదారులు

బాలల సంక్షేమం గాలికి...

- కొరవడిన పర్యవేక్షణ
- పట్టించుకోని అధికారులు
- వెట్టిచాకిరీలో నేటి బాలలు

బీచ్‌రోడ్డు, మే 19 (ఆంధ్రజ్యోతి) : బాలల సంక్షేమంపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా ఇసుక బట్టీల్లోనూ, దుకాణాల్లోనూ నేటి పౌరులు మగ్గిపోతున్నారు. బాలల సంరక్షణలో భాగంగా కేంద్ర మహిళా సంక్షేమ శాఖ సహకారంతో ప్రతి జిల్లాలో 1098 (చైల్డ్‌లైన్) హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు.ఈ వ్యవస్థ బాలల రక్షణ, సంరక్షణతో పాటు పిల్లలకు అత్యవరస సేవలందించేందుకు 24 గంటలు పనిచేసేది. 1098కి సమాచారం వచ్చిన గంటలో చైల్డ్‌లైన్ సిబ్బంది వెళ్లి బాలలను రక్షించేవారు. ఏయూ కేంద్రంగా 1098 చైల్డ్‌లైన్ నోడల్ ఏజెన్సీ ఉంది. దీనికి అనుబంధంగా కోలాబ్ అనే సంస్థ పని చేస్తుంది.ఈసంస్థ ద్వారానే బాలలను రక్షించి, వారిని బాలల సంక్షేమ సమితి ముందు ప్రవేశ పెట్టి సంరక్షించేవారు. కానీ ప్రస్తుతం నోడల్ ఏజెన్సీలో సిబ్బంది కొరత వల్ల సకాలంలో సేవలందడం లేదు. తమ పరిధిలో ఉన్నంత మేర నోడల్ ఏజెన్సీ జిల్లా బాలల సంరక్షణ విభాగానికి సమాచారం ఇస్తుంది తప్ప ఎటువంటి సేవలందించడం లేదు. దీంతో బాలల హక్కులకు చాలవరకు విఘాతం కలుగుతుందని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థలే దిక్కు

బాలల సంక్షేమంలో ప్రభుత్వ సంస్థలు విఫలం కావడంతో వాటికి అనుబంధంగా పనిచేసే స్వచ్ఛంద సంస్థలే దిక్కవుతున్నాయి. దుకాణాలు, పరిశ్రమలు, ఇసుక బట్టీలపై అడపాదడపా కొన్నిచోట్ల దాడులు జరుగుతున్నాయంటే అందుకు కేవలం స్వచ్ఛంద సంస్థల ఫిర్యాదులే కారణం. ఇవీ కూడా నిర్వీర్యమైతే ఇక బాలల సంరక్షణ గాలిలో దీపంలా ఉంటుంది.

ఐసీపీఎస్‌కి సిబ్బంది కొరత...

బాలలకు పూర్తిస్థాయిలో రక్షణ, సంరక్షణ అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ప్రతి జిల్లాకు బాలల సంరక్షణ విభాగం (ఐసీపీఎస్) ఏర్పాటు చేశారు. ఈ విభాగం జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో నడుస్తుంది. బాలల హక్కులకు ఎలాంటి భంగం కలిగినా ఈ విభాగం ద్వారా సేవలందించాల్సి ఉంది. జిల్లా బాలల సంరక్షణ అధికారితో పాటు సదనాలను పర్యవేక్షించేందుకు 12 మంది సిబ్బంది పని చేస్తున్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా బాలల సంరక్షణ విభాగం సేవలు ప్రత్యేకంగా బాలల సంక్షేమానికి కేటాయించాలి.
- చైల్డ్‌లైన్ లేనిచోటను ఏర్పాటు చేయాలంటే సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి.
- బాలల సంరక్షణ విభాగానికి ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేయాలి.
- ప్రతి నెల స్వచ్ఛంద సంస్థలతో కలిసి విస్తృతంగా దాడులు నిర్వహిస్తూ.. అందరిలో చైతన్యం తీసుకురావాలి.
- బాలల సదనాలను నిర్వహిస్తున్న సంస్థలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- ఐసీపీఎస్ సిబ్బందికి కేటాయించిన విధులను పక్కాగా నిర్వహిస్తే చాలవరకు బాలలకు రక్షణ, సంరక్షణ కలుగుతుంది.



డీఈఓకి నోటీసు అందిస్తున్న ఉపాధ్యాయులు

రేపు డీఈఓ కార్యాలయం ముట్టడి

ఆరిలోవ, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో ఉన్న ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ ఐక్య వేదిక ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించ నున్నట్టు జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు తెలిపారు. సోమవారం వారు డీఈఓ ప్రేమ్‌కుమా ర్‌ను కలిసి నోటీసు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16 డిమాండ్లతో ఈ కార్యక్రమాన్ని చేపడుతు న్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇమంది పైడిరాజు, దాసరి నాగేశ్వరరావు, అంబేద్కర్, శోభారాణి. కె. సుబ్బారావు, ఎ. అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వమిత్ర సర్వేను విజయవంతం చేయండి



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమార్

పద్మనాభం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటికి శాశ్వత ధ్రువీకరణ చేసి ఆస్తి హక్కు పట్టాలు ఇవ్వడానికి చేపడుతున్న సర్వే ఆఫ్ విలేజస్ ఆబాది అండ్ మేపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ రూరల్ ఏరియాస్ (స్వమిత్ర) కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం. విజయకుమార్ కోరారు. సోమవారం ఆయన వెంకటాపురం గ్రామంలో స్వమిత్ర సర్వేపై జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. ఈ సర్వే వల్ల ప్రజలకు తమ ఆస్తిపై హక్కు పత్రాలు రూపొందిస్తారన్నారు.దీనికోసం గ్రామాన్ని డ్రోన్ సర్వే చేపట్టి ప్రతి ఇంటిని సర్వే చేస్తారని తెలిపారు. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న బృహత్తర కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని తమ ఇళ్లను సర్వే చేయించుకొని ఆస్తి హక్కు పత్రాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.రమణ, ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, ఈఓఆర్డీ మీనాకుమారి, కార్యదర్శి గాయత్రి స్థానిక నాయకులు గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముద్రించిన ధరకే వస్తువు విక్రయించాలి

- తూనికలు, కొలతలశాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి) : ప్యాకెట్లపై ముద్రించిన ధరకే వస్తువులు విక్రయించాలని, అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ థామస్ రవికుమార్ హెచ్చరించారు. ఈనెల 20న వరల్డ్ మెట్రాలజీ డే పురస్కరించుకుని సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని దుకాణదారులు, ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజర్లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపులో విక్రయించే ప్రతి వస్తువుపై తేదీ, ధర ఉండాలన్నారు. అదనంగా వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంలో వ్యాపారులు పారదర్శకత పాటించాలని సూచించారు. ప్యాకింగ్ ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ తరహా ఫిర్యాదులు వచ్చే దుకాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. వినియోగదారులు కూడా అదనంగా వసూలు చేసే వారిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ అప్పలరాజు, సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ కంట్రోలర్ రవికుమార్

నేటి నుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు

మురళీనగర్, మే 19 (ఆంధ్రజ్యోతి):ఉత్తర నియోజకవర్గంలోని ప్రసిద్ధ హనుమాన్ ఆలయంగా విరాజిల్లుతున్న సూర్యానగర్ శ్రీ యోగసిద్ధాంజనేయ ఆలయంలో మంగళ, బుధ, గురువారాల్లో వార్షిక హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు తెలిపారు.

చెత్త తొలగింపులో నిర్లక్ష్యం

- పిఠాపురం కాలనీ బజార్ వద్ద పేరుకుపోయిన చెత్త

మద్దిలపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ కాయగూరల బజార్ వద్ద చెత్త పేరుకుపోయింది. మూడు రోజుల నుంచి చెత్త తొలగించకపోవడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. అలాగే, పిఠాపురం కాలనీ గెడ్డలో కూడా పూడికలు పేరుకుపోయాయి. పూడికలు పక్కనే చెత్త కూడా ఉండడంతో పరిసరాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. దుర్గంధంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. శానిటరీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న చెత్తను తొలిగించకపోవడంపై నివాసులు మండి పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం పిఠాపురం కాలనీ పార్కు నుంచే పారిశుధ్య కార్మికులు విధులకు హాజరవుతారు. పక్కనే ఉన్న చెత్తను మాత్రం తొలగించకపోవడంపై దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా గెడ్డలో పూడికలు, రోడ్ల పక్కన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



పిఠాపురం కాలనీ బజార్ వద్ద ఇదీ పరిస్థితి..

సుందరయ్య సేవలు చిరస్మరణీయం

మధురవాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య కార్మిక వర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య 40వ వర్ధంతి సభను బింద్రానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయ కులు శేషగిరిరావు, రాజుకుమార్, అప్పలరాజు తదితరులు సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.



ఆరిలోవలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కార్మికులు

తగరపువలసలో...

తగరపువలస : స్థానిక సీపీఎం నాయకులు పలుచోట్ల పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభలు నిర్వహించారు. బైపాస్ రోడ్డు ఆటోస్టాండ్, బాలాజీనగర్, కొత్తపేట ప్రాంతాల్లో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి. సూర్యనారాయణ, ఆర్. నరసింగరావు, ఎస్. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : శ్రామిక వర్గానికి హాని కలిగించే ప్రభుత్వాలను ప్రజలు వ్యతిరేకించాలని సీఐటీయూ నాయకుడు డి. అప్పలరాజు పిలుపునిచ్చారు.పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా పీఎంపాలెం రెండో బస్టాప్ వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజల కోసం పరితపించే నాయకులు కరువయ్యారని, కమ్యూనిస్టులు మాత్రమే అటువంటి విలువలతో జీవిస్తున్నారని తెలిపారు. సుందరయ్య జీవితం ఎంతోమందికి ఆదర్శనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్ శేషుబాబు, డి. సూరిబాబు, కె. అర్జునమ్మ, తదితరులు పాల్గొన్నారు.

24న బుద్ధుని బోధనలపై సదస్సు

డాబాగార్డెన్స్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో 'బుద్ధుని బోధనలు-ప్రపంచ శాంతి' అనే అంశంపై ఈ నెల 24న సదస్సు నిర్వహిస్తున్నట్టు ఐఏఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



సిరిపురం : డిప్యూటీ మేయర్ ఎన్నికపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో సోమవారం సాయంత్రం చర్చలు జరిగాయి. మంగళవారం జరిగే పండగకు ట్రాఫిక్ ఆంక్షలు ఎక్కువగా ఉంటాయని ఎమ్మెల్యే గంటా తెలిపారు ఆయ నతో పాటు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు,మేయర్ శ్రీనివాసరావు ఉన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మత్స్యకారుల సమస్యలపై వినతి

పెదవాల్తేరు, మే 19 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని ప్రభుత్వం రూ.20 వేలకు పెంచడం హర్షనీయమని,ఈ సొమ్ము సకాలంలో అందేలా చూడాలని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడును మత్స్యకార యువజన సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సోమవారం వారు నగరానికి వచ్చిన మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు (61 రోజులు) సముద్ర జలాల్లో చేపల వేట నిషేధించిందని, రెండు నెలలకు గత వైసీపీ ప్రభుత్వం రూ. 10 వేల భృతి ఇవ్వగా కూటమి రూ.20 వేలకు పెంచడం హర్షనీయమని తెలిపారు. పథకంలో అనర్హులు ఉంటే వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్లను ఆదుకుంటాం : ఎమ్మెల్యే వెలగపూడి



ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం ఇస్తున్న గెస్ట్ లెక్చరర్లు

వెంకోజీపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : అతిథి అధ్యాపకులకు నెలవారీ వేతనం అందేలా చర్యలు తీసుకుంటానని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు హామీ ఇచ్చారు. సోమవారం ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అతిథి అధ్యాపకులు తమ సమస్యలపై వెలగపూడికి వినతిపత్రం ఇచ్చారు. తాము ఏయూలో 2010 నుంచి అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇంటర్మీడియేట్ గెస్ట్ లెక్చరర్‌కు నెలకు రూ. 27 వేలు వేతనం పెంచిందని, ఈ నేపథ్యంలో ఏయూలో తమకు యూజీసీ రూల్స్ ప్రకారం వేతనాలు ఇప్పించాలని కోరారు. అలాగే ఎయిడెడ్ ఫ్యాకల్టీ ఆన్ డ్యూటీ పూర్తయినందున వారిని వెనక్కి పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ వీసీతో మాట్లాడి వేతనాలు సకాలంలో అందేలా చూస్తానన్నారు. మంత్రి లోకేశ్, వీసీ రాజశేఖర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. సురేశ్ మీనన్, ప్రసాద్, గిరీష్, రాయ్, నాయుడు, సురేంద్ర, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత పుచ్చలపల్లి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు కుమార్

ఆరిలోవ, మే 19 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని స్థానిక బీఎస్ఆర్‌నగర్‌లో వామపక్షాల నాయకులు సోమవారం నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతంలోని కమ్యూనిస్టు పార్టీలో సుందరయ్య ముఖ్య పాత్ర వహించారన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన ఆయన నిరంతరం పేదల కోసం పోరాడారని తెలిపారు.పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నేతగా అనేక సంస్కరణలకు దోహదపడ్డారన్నారు. ఆయన స్ఫూర్తితో పోరాటాలను ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వీ నరేంద్రకుమార్, నాయుడు, నాగరాజు, రమణ, ముత్యాలమ్మ పాల్గొన్నారు.

విశాఖ మార్కెటింగ్ కమిటీ సభ్యురాలిగా శోభ



వెంకోజీపాలెం, మే 19 (ఆంధ్రజ్యోతి) : విశాఖ మార్కెటింగ్ కమిటీ సభ్యురాలిగా టీడీపీ 16వ వార్డు మహిళా నాయకురాలు మొల్లి ప్రశాంత్ భార్య నారు శోభ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వు లు జారీ అయ్యాయి. ఆమె నియామకం పట్ల ఆ వార్డు అధ్యక్షుడు నారు గోపి, ఇతర నాయకులు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి : సీపీఐ

ఆరిలోవ, మే 19 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఇళ్ల స్థలాలు అందించాలని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ డిమాండ్ చేశారు. సోమవారం వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో జగన్ ప్రభుత్వం పేదలకు సెంటు స్థలం కేటాయించడానికి వ్యతిరేకంగా పోరాడమన్నారు. చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలంతో పాటు రూ. 4 లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఎండీ బేగం, ఎ. దేవుడమ్మ, కె.. లక్ష్మణరావు, సీహెచ్ కాసుబాబు, కె. సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- ఒకరు సచివాలయ ఉద్యోగి

- విధులకు వెళుతుండగా ఘటన

పెదబయలు, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కొల్లి రమణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన జర్సింగి కార్తీక్ ప్రసాద్ (30) పర్రెడా సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటి వద్ద భోజనం చేసి బైక్‌పై విధులకు హాజరయ్యేందుకు బయలుదేరాడు. అతనికి తోడుగా వరుసకు అల్లుడైన బొండా మనోజ్‌కుమార్ (21) కూడా వెళ్లాడు. అడుగులపుట్టు పంచాయతీ కొత్తపుట్టు వంతెన సమీపాన బైక్ అదుపు తప్పి బూరుగుచెట్టును బలంగా ఢీకొని లోయలో పడిపోయింది. పెద్ద శబ్దం రావడంతో సమీపంలోని దుకాణ యజమాని గమనించి గ్రామస్థుల సహాయంతో వారిద్దరినీ బయటకు తీశారు. అప్పటికే మనోజ్‌కుమార్ మృతి చెందాడు. కార్తీక్ ప్రసాద్ కొన ఊపిరితో ఉండడంతో స్థానికులు అంబులెన్స్‌లో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు. మృతదేహాలను సీహెచ్‌సీ మార్చురీలో భద్రపరిచామని, మంగళవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా కార్తీక్ ప్రసాద్ తండ్రి రాజుబాబు విశాఖపట్నంలోని గోపాల పట్నం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ (క్రైమ్)గా పనిచేస్తున్నారు. మనోజ్‌కుమార్ తండ్రి సదాశివరావు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అందివచ్చిన కుమారులు మృతి చెందడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రాణాలను హరిస్తున్న రోడ్ హిప్నోసిస్



కళ్లు తెరిచి ఉన్నా, తెలివి లేకపోవడమే రోడ్ హిప్నోసిస్...

(ఎంవీపీ కాలనీ-ఆంధ్రజ్యోతి)

రోడ్డు బాగుంది. డ్రైవర్ తెలివిగా, అప్రమత్తంగానే ఉన్నట్టున్నాడు. కారు వేగంగా వెళుతోంది. హఠాత్తుగా ముందు వెళుతున్న వాహనాన్నో లేదా ఆగి ఉన్న వాహనాన్నో గుద్దేసింది. ఏం జరిగిందో తెలిసేలోపే ప్రమాదం జరిగిపోయింది. సరదాగా, హాయిగా సాగుతున్న జీవిత ప్రయాణం ఆగిపోయింది. కుటుంబాలు కన్నీటి సాగరంలో మునిగిపోయాయి. ఎందుకు జరిగింది?, ఏం జరిగింది?...అన్న విశ్లేషణలు ఉండవు. వేగం లేదా నిర్లక్ష్యం ప్రమాదానికి కారణంగా నిర్ధారణ జరుగుతుంది. కానీ చాలా ప్రాణాలను గాలిలో కలిపేస్తున్న ఆ భూతం పేరే 'రోడ్ హిప్నోసిస్'.

రోడ్ హిప్నోసిస్ అంటే...

రోడ్డు ప్రమాదాలకు అతి వేగం, అజాగ్రత్త, మద్యం సేవించడం, రహదారులు బాగులేకపోవడం... ఇలా అనేక కారణాలు ఉన్నాయి. ఇటీవలి కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చిన మరో అంశం రోడ్ హిప్నోసిస్. జాతీయ రహదారులపై ముందు వాహనాన్ని ఢీకొన్న ఘటనలకు కారణం రోడ్ హిప్నోసిస్ అని నిపుణులు పేర్కొంటున్నారు. అసలు ఈ పదం చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. విద్యావంతులకే దీనిపై అవగాహన లేదు. ట్రక్ డ్రైవర్లకు ఏం ఉంటుంది. రోడ్ మిప్నోసిస్ అంటే 'అర్థం కాని ఓ శారీరక స్థితి'గా నిపుణులు పేర్కొంటున్నారు. ఒక విధంగా చెప్పాలంటే కళ్లు తెరిచి ఉన్నా, తెలివి లేకపోవడమే రోడ్ హిప్నోసిస్. డ్రైవింగ్ ప్రారంభించిన రెండున్నర గంటల తర్వాత ఇది ప్రారంభమవుతుంది. డ్రైవింగ్ చేసేవారు కళ్లు తెరిచే ఉంటారు. కానీ మెదడు విశ్లేషణ చేయడం మానేస్తుంది. ప్రయాణం మాత్రం సాగుతుంది. ఎదురుగా ఉన్న వాహనం ఏ వేగంతో వెళుతుందో అంచనా వేయలేని పరిస్థితి. ఆగి ఉన్న వాహనం కనిపించినా, బ్రేకు వెయ్యాలన్న సంకేతం మెదడుకు అందదు. ప్రమాదం జరగడానికి ముందు పదిహేను నిమిషాల పాటు ఏమీ గుర్తుండదు. సాధారణంగా ఈ ప్రమాదాల్లో వేగం 140 కిలోమీటర్లు ఉంటుంది.

ఏం చేయాలి

ప్రతి సమస్యకూ ఓ పరిష్కారం ఉంటుంది. ప్రమాదాల బారి నుంచి తప్పించుకోవడానికి చిన్నపాటి చిట్కాలు పాటిస్తే చాలు. రెండున్నర గంటల తరువాత డ్రైవింగ్ మరొకరికి అప్పగించాలి. ఒక్కరే డ్రైవింగ్ అంటే ప్రతి రెండున్నర గంటలకు ఓసారి కారు ఆపాలి. నాలుగు అడుగులు అటూఇటూ వేసి, కాసేపు రిలాక్స్ కావాలి. అవకాశం ఉంటే కాసేపు నిద్రపోవడం మంచిది. ఆ సమయంలో ఒకసారి మిమ్మల్ని మీరు పరిశీలించుకోవడం చాలా అవసరం. గడచిన పదిహేను నిమిషాలలో మీరు దాటుకుంటూ వచ్చిన స్థలాలు, వాహనాలు, రోడ్డు సంకేతాలు, ఇతరత్రా ఏమైనా మీ మెదడులో రికార్డు అయ్యాయా లేదో చెక్ చేసుకోవాలి. అవేమీ మీకు గుర్తురావడం లేదంటే మీరు, మీతో పాటు ఉన్నవారిని ప్రమాదం వైపు నడిపిస్తున్నారనే అర్థం. డ్రైవింగ్ చేసే సమయంలో వాహనంలో ఉన్న ఇతర ప్రయాణికులతో మాట్లాడుతూ ఉండడం అవసరం. డ్రైవింగ్ చేసే ముందు తగినంత నిద్ర చాలా ముఖ్యం. బాగా అలసిపోయినప్పుడు, ఒత్తిడి ఉన్నప్పుడు డ్రైవింగ్ చేయకపోవడమే మేలు. రాత్రి సమయంలో అయితే వారికి సరైన నిద్ర అప్పటికే ఉందా లేదా, నిద్ర ఆపుకోగలడా లేదా నిర్ధారించుకోవడం చాలా అవసరం. రోడ్ హిప్నోసిస్ స్థితి సాధారణంగా రాత్రి సమయంలో ఎక్కువగా వస్తుంది. ఆ సమయంలో ప్రయాణికులు కూడా నిద్రపోతుంటారు. డ్రైవింగ్ చేసేవారిని అప్రమత్తం చేసేవారుండరు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వచ్చిన కొత్త కార్లలో గేరు మార్చాల్సిన అవసరం లేకుండా, నిర్ణీత స్పీడ్‌లో వెళ్లిపోతున్నాయి. ఈ కార్లలో డ్రైవింగ్ చేసేవారు మరింత అప్రమత్తంగా ఉండాలి.



- రెండున్నర గంటల డ్రైవింగ్ తర్వాత ప్రారంభం
- మెదడు, కళ్లు చూసిన విషయాలు, విశ్లేషణ ఆగిపోతుంది
- ప్రతి రెండున్నర గంటలకు ఓసారి వాహనాన్ని ఆపాలి
- నాలుగు అడుగులు వేయాలి, రిలాక్స్ కావాలి

తగిన జాగ్రత్తలతోనే ప్రమాద నివారణ సాధ్యం



డ్రైవింగ్ సమయంలో ఉత్పన్నమయ్యే రోడ్ హిప్నోసిస్ సమస్యకు కారణం ఏమిటన్నది కచ్చితంగా చెప్పలేము. కానీ, సుదూర ప్రాంతాలకు డ్రైవింగ్ చేసే వారిలో ఈ సమస్య ఉత్పన్నం కావచ్చు. కొన్నిరకాల దీర్ఘకాలిక సమస్యలకు మందులు వినియోగించే వారిలో కాస్త దీని తీవ్రత అధికంగా ఉండవచ్చు. కాబట్టి, దూర ప్రాంతాలకు డ్రైవింగ్ చేస్తూ ప్రయాణం చేసేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కనీసం రెండు గంటలకు ఒకసారి ఆగి వెళ్లడం మంచిది. సహచరులతో మాట్లాడుతుండడం అవసరం. వాహనం లైటింగ్ సరిగా ఉండేలా చూసుకోవాలి. డల్ లైటింగ్ ఉంటే ఈ సమస్య మరింత ఎక్కువగా ఉండవచ్చు. ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో కూడా ఇది కనిపిస్తుంది. బ్రెయిన్ యాక్టివిటీ తగ్గడం వల్ల ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి, చుట్టుపక్కల యాక్టివిటీస్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సహచరులతో మనస్ఫూర్తిగా మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ద్వారా బ్రెయిన్ యాక్టివిటీ వేగంగా ఉండేలా చేయవచ్చు. తద్వారా డ్రైవింగ్ హిప్నోసిస్ బారినపడకుండా ఉండవచ్చు.

- డాక్టర్ బుచ్చిరాజు, న్యూరాలజీ వైద్య నిపుణులు

డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా ఎందుకు?

శాసనమండలి విపక్షనేత బొత్స ప్రశ్న

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా కూటమి పార్టీల మధ్య విభేదాలు బయటపడ్డాయని శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. లాసన్స్‌బే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవీఎంసీలో మెజారిటీ ఉన్నప్పటికీ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదాపడడం ఇందుకు నిదర్శనమన్నారు. కూటమి పార్టీలకు అధికారాన్ని అడ్డంపెట్టుకుని దోచుకోవాలన్న తపనతప్ప, ప్రజలకు మంచిపాలన అందించాలనే ఆలోచన లేదని విమర్శించారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా సాగుతోందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లో చేరిన 27 మంది కార్పొరేటర్లు విప్‌ను ఉల్లంఘించినందున చర్యలు తీసుకోవాలని కోరితే ఇంతవరకు ఎన్నికల అధికారి నుంచి స్పందనలేదని, దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు తమ పార్టీ పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఎన్నికలకు ముందు మహిళలకు పథకాల ఆశచూపించి, ఇప్పుడు అమలుచేయడం లేదని బొత్స ఆరోపించారు. పీ4కి, ఆడబిడ్డ నిధికి సంబంధం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

వచ్చేవారం అర్జీదారులతో కలెక్టర్ ఫోన్ సంభాషణ

- ఒకే సమస్యపై పదే పదే వినతులు రావడంతో అసహనం
- అధికారులను జవాబుదారీ చేయాలని నిర్ణయం
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తాజాగా 225 ఫిర్యాదులు

మహారాణిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నుంచి కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అర్జీదారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్య మూలాలను తెలుసుకోనున్నారు. ఒకే సమస్యపై పదే పదే అర్జీలు వస్తుండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రెండోసారి అర్జీ రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు పదే పదే చెబుతున్నా.. పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో వచ్చే వారం అధికారుల సమక్షంలోనే అర్జీదారులతో ఫోన్‌లో సంభాషించాలని నిర్ణయించారు. అధికారుల్లో జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా ఆయన ఈ వినూత్న ప్రయత్నాన్ని ప్రారంభించనున్నారు. గ్రామసభలలో అందిన దరఖాస్తులే పీజీఆర్ఎస్‌లోనూ అర్జీల రూపంలో రావడాన్ని కలెక్టర్ గుర్తించి అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

అందిన అర్జీలపై విచారణ చేపట్టి పరిష్కారానికి కృషిచేయాలని, పునరావృతమైతే సంబంధిత అధికారులు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ పునరుద్ఘాటించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 225 అర్జీలను అధికారులు స్వీకరించారు. అందిన వినతులలో రెవెన్యూ విభాగానికి సంబంధించి 91, జీవీఎంసీ 51, పోలీసు 18, ఇతర శాఖలకు సంబంధించి 65 ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ అర్జీదారులతో స్వయంగా మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న అర్జీల పరిస్థితిపై ఆరా తీశారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్జీదారులు తమ దరఖాస్తుల పరిష్కార పురోగతిని తెలుసుకునేందుకు 1100 నెంబరుకు ఫోన్ చేయాలని, సందేహాలు ఉన్నా అడగవచ్చని కలెక్టర్ సూచించారు. కొత్త ఫిర్యాదులు కూడా ఇదే కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్, వివిధ విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పార్కు స్థలం కబ్జాపై ఫిర్యాదు

జీవీఎంసీ జోన్-2 పరిధిలోని పార్కు స్థలాలు కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని కాపాడాలని కోరుతూ సామాజిక కార్యకర్త రజనీ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. స్వతంత్ర నగర్‌లో రూ.3 కోట్లతో ప్రభుత్వం పార్కును అభివృద్ధి చేసిందని, ఇందులో 150 గజాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తు లు ఆలయం పేరుతో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జీవీఎంసీలో ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి కబ్జాదారులకు అనుకూలంగా నిర్మాణాలకు శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందని, చర్యలు తీసుకుని పార్కు స్థలాన్ని కాపాడాలని ఆమె కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, జిల్లా అధికారులు

అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

- రేపు బీచ్‌రోడ్‌లో ప్రాథమిక వేడుకలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరించిన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే వేడుకలకు అనువైన స్థలాలను గుర్తించామని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. యోగా దినోత్సవ నిర్వహణపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో భాగంగా కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్. భవానీశంకర్ తదితరులతో కలిసి పాల్గొన్న కలెక్టర్, జిల్లాలో యోగా వేడుకలకు చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలో ఇప్పటికే ప్రాథమికంగా అందరి అధికారులను సన్నద్ధం చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా యోగా దినోత్సవానికి జిల్లాలో 2.5 లక్షల మందిని భాగస్వాములను చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. శిక్షకుల ద్వారా యోగా సాధన ప్రారంభించామన్నారు. ఈ నెల 21న ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు బీచ్‌రోడ్‌లో 500మందితో ప్రాథమిక వేడుకలు నిర్వహించి కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుడతామన్నారు. ఆ రోజు నుంచి గ్రామ/మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, సాధనకు ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకుని కార్యక్రమం విజయవంతానికి కృషిచేస్తామన్నారు. వచ్చే నెల 21న జరగబోయే ప్రదర్శనకు సంబంధించి విధి విధానాలు ఖరారైన వెంటనే పూర్తిస్థాయి చర్యలు చేపడతామని సీఎస్‌కు నివేదించారు. ఆర్కేబీచ్ నుంచి భీమిలి, అక్కడ నుంచి విజయనగరం జిల్లా మీదుగా శ్రీకాకుళం వరకు ఐదు లక్షల మందిని భాగస్వాములను చేస్తూ అంతర్జాతీయ యోగా వేడుకలు నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ వివరించారు.

డిప్యూటీ మేయర్ పదవిపై పునరాలోచన చేయండి

అసంతృప్త కార్పొరేటర్ల సూచన

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పదవిని యాదవ సామాజిక వర్గానికి ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదని టీడీపీ అసంతృప్త కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తంచేశారు. డిప్యూటీ మేయర్ పదవికి జనసేనకు చెందిన 64వవార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డి పేరు ప్రకటించగానే యాదవ, కాపు సామాజికవర్గాలకు చెందిన 15 మంది కార్పొరేటర్లు ఎన్నికను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించి గ్రాండ్‌బే హోటల్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారంతా తమ ఆవేదన వెళ్లగక్కారు. జీవీఎంసీ మేయర్ పదవిని యాదవ సామాజిక వర్గం నుంచి తప్పించి గవర సామాజిక వర్గానికి చెందిన పీలా శ్రీనివాసరావుకు కట్టబెడుతూ, డిప్యూటీ మేయర్ పదవిని యాదవ మహిళకు ఇస్తామని నేతలు ఆశ కల్పించారన్నారు. అలాగే డిప్యూటీ మేయర్‌గా ఉన్న జియ్యాని శ్రీధర్ (కాపు)ను తొలగించి అసలు ఆ పదవి ఆశించని వ్యక్తి పేరు ప్రకటించడమేమిటని ప్రశ్నించారు. యాదవ, కాపు సామాజికవర్గాల కార్పొరేటర్లకు మాటమాత్రంగా అయినా చెప్పకుండా నిర్ణయం తీసుకోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి పార్టీలకు చెందిన యాదవ మహిళ ఎవరికి డిప్యూటీమేయర్ పదవి ఇచ్చినా తమకు సమ్మతమేనని, నేతలు పునరాలోచన చేయాలని కోరారు. లేకుంటే మంగళవారం కూడా ఎన్నికకు హాజరయ్యే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, గొలగాని మంగవేణి, మొల్లి హేమలత, పీవీ నరసింహం, బల్లా శ్రీనివాసరావు, కోదూరి అప్పలరత్నం, గేడి విజయలక్ష్మి, మొల్లి ముత్యాలు, లొడగల అప్పారావు, విల్లూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



హోటల్‌లో సమావేశమైన టీడీపీ అసంతృప్త కార్పొరేటర్లు

క్రైం... crime news

మద్యానికి బానిసై ఆత్మహత్య

గోపాలపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వెంకటాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక రామాలయం సమీపంలో సీరపు నూకరాజు (39) కుటుంబంతో నివసిస్తున్నాడు. రాడ్ బెండింగ్ పనులు చేసే నూకరాజు మద్యానికి బానిసై తరచూ భార్య ఎర్నికుమారితో తగాదా పడుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం మద్యం తాగి నూకరాజు భార్యతో గొడవపడి గదిలోనికి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అయితే, ఎంత సేపటికీ వెలుపలకు రాకపోవడంతో తలుపులు పగలగొట్టి చూడగా నూకరాజు ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. ఈ మేరకు భార్య ఎర్నికుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి తల్లి, భార్య, కుమారుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

టాస్క్ గేమ్స్ పేరుతో రూ.18 లక్షలకు టోకరా

ఎండాడ, మే 19 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల మోసాలకు అమాయకులు బలైపోతున్నారు. టాస్కగేమ్స్ పేరుతో ఓ వ్యక్తి ఏకంగా రూ. 18 లక్షలు మోసపోయాడు. సైబర్ క్రైం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నగరంలోని మురళీనగర్‌కి చెందిన ఒక వ్యక్తికి గత ఏడాది సెప్టెంబరులో తన టెలిగ్రామ్ అకౌంట్‌కి పార్ట్ టైం జాబ్‌కి సంబంధించిన మెసేజ్ ఉంది. రోజుకి రూ. 3 వేలు నుంచి రూ. 4 వేలు వరకు సంపాదించుకోవచ్చని మెసేజ్ సారాంశం. వెంటనే తన టెలిగ్రామ్ అకౌంట్‌ను 21146 రికార్డు బ్రేకర్ అనే గ్రూపులో యాడ్ చేశారు. ఆ గ్రూపులో రోజుకి ఈజీగా డబ్బులు ఎలా సంపాదించవచ్చని మెసేజ్‌లు పోస్టు చేసేవారు. ఇలా ఒక లింక్ పోస్టు చేశారు. లింక్ ఓపెన్ చేయగా కొన్ని వస్తువుల కనిపించాయి. వాటిని కొనుగోలు చేసి వాటి వివరాలను స్క్రీన్ షాట్ తీసి గ్రూపులో పోస్టు చేయగా ఒక టాస్కకి రూ. 150 చొప్పున కమిషన్ ఇచ్చేవారు. కమిషన్‌కి ఆశ పడి మొదట పది వేలు పంపించగా కమిషన్ నాలుగు వేల రూపాయలు కలిపి రూ 14,000 పంపించిన వ్యక్తి అకౌంట్‌కి వచ్చాయి. మరో పది వేల రూపాయలు పంపించగా ఇంకా టాస్కలు ఉన్నాయని ఒక లింక్ పంపించారు. ఇంకా చాలా టాస్కలు ఉన్నాయని ఇందుకోసం అమౌంట్ డిపాజిట్ చేయాలంటూ ఆదేశాలిస్తూ ఇప్పుడు పంపించిన డబ్బులు ఫ్రీజ్ అవ్వకుండా ఉండాలంటే మరింత డబ్బులు పంపించాడు. డబ్బులు రావని భయపడి మొత్తం రూ 18.11,204 పంపించి మోసపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తులో భాగంగా డబ్బులు పంపిన వ్యక్తి బ్యాంకు స్టేట్‌మెంట్ ఆధారంగా పరిశీలించగా కృష్ణా జిల్లాలోని ఒక వ్యక్తి అకౌంట్‌లోకి వెళ్లగా వారిని విచారించగా పార్ట్‌టైం జాబ్‌ల పేరుతో భారీగా వసూలు చేసి హైదరాబాద్‌కి చెందిన వ్యక్తికి వెళ్లినట్లుగా గుర్తించారు. సీడీఎం మెషీన్ ద్వారా నగదు తీసుకున్నారు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తుకి కష్టతరమవుతుంది. డబ్బులతో క్రిప్టో కరెన్సీలో కన్వర్టు చేసి సైబర్ నేరగాళ్లకి వెళ్తున్నట్లు గుర్తించారు. ముద్దాయి మొబైల్ ఫోన్ చెక్ చేయగా బైనెన్స్ వాలెట్‌లో 90000 యూఎస్‌డీటీ క్రిప్టో కరెన్సీ ఉన్నట్టు గుర్తించి దాన్ని సీజ్ చేసి ముద్దాయిని అరెస్టు చేశారు.

గాజువాకలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అదృశ్యం

గాజువాక, మే 19 (ఆంధ్రజ్యోతి): గాజువాకలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అదృశ్యమైనట్లు ఇక్కడి పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందింది. ఇందుకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.. గాజువాక దరి గుడివాడ అప్పన్నకాలనీ ప్రాంతానికి చెందిన అప్పాబత్తుల చిన్నారావు (55), పార్వతి (45) కాలనీల్లో చీటీలు, లక్కీడ్రాలు నిర్వహించేవారు. అయితే చీటీలు పాడుకున్న వారికి తిరిగి నగదు ఇవ్వకపోవటం, ఆపై కొంత మంది ఇంటికి రావటంతో ఈ దంపతులు తమ కుమార్తె రేవతి (23)తో కలిసి గత ఆరో తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని పేర్కొంటూ పార్వతి తల్లి అనసూయ గాజువాక పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

కాళేశ్వరానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక సర్వీసులు నడపాలని ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతి నదుల సంగమ ప్రాంతమైన కాళేశ్వరం వద్ద ఈ నెల 26 వరకు పుష్కరాలు జరుగుతాయి. ఈ నెల 23న మధ్యాహ్నం 3 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్‌లో ఈ ప్రత్యేక సర్వీసులు ప్రారంభమవుతాయని, పుష్కరాలకు రాకపోకలు సాగించే భక్తుల డిమాండ్‌ను అనుసరించి 24, 25 తేదీల్లోనూ ప్రత్యేక సర్వీసులు నడుపుతామని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పుష్కరస్నానం అనంతరం తిరుగుప్రయాణంలో భద్రాచలం శ్రీరాముల వారి దర్శనం కూడా ఉంటుందని పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ సర్వీసులో ఒకరికి వెళ్లి వచ్చేందుకు రూ. 2,700 టిక్కెట్టు రుసుముగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ ఆన్‌లైన్, ద్వారకాబస్‌స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్, గుర్తింపు పొందిన ఏజెన్సీల వద్ద టిక్కెట్టు రిజర్వ్ చేసుకోవచ్చునని సూచించారు. ఈ పుష్కరాలకు వెళ్లే యాత్రికులు కోరుకుంటే బస్సులను అద్దెకు కూడా ఇస్తామని ఆర్ఎం అప్పలనాయుడు పేర్కొన్నారు.

అద్దెకు ఆర్టీసీ స్థలాలు, షాపులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని బస్టాపుల్లో ఖాళీగా ఉన్న స్థలాలు, ఖాళీ కానున్న స్టాల్స్, పక్కా షాపులు అద్దెకు ఇచ్చేందుకు విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. ఆసక్తిగల వ్యక్తులు, వ్యాపారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను గాజువాక, కూర్మన్నపాలెం, సింహాచలం, మద్దిలపాలెం, వాల్తేరు, విశాఖపట్నం డిపోమేనేజర్ కార్యాలయాల్లోను, ద్వారకాబస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కార్యాలయంలోను లభ్యమవుతాయని ఆర్టీసీ విశాఖ రీజియన్ పర్సనల్ ఆఫీసర్ జె.తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 21న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు జారీ చేస్తామని, పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 22న మధ్యాహ్నం రెండు గంటల లోపు రీజనల్ మేనేజర్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ విధానంలో షాపులు, స్థలాలు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో సదుపాయాలపై డీఆర్ఎం ఆరా



విశాఖ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, మే 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం లలిత్ బొహ్రా సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రయాణికులకు కల్పించిన మౌలిక సదుపాయాల నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫామ్‌లపై ఏర్పాటు చేసిన ఎస్కలేటర్లు, లిఫ్టుల పనితీరును పరిశీలించారు. అలాగే ప్లాట్‌ఫామ్‌లు, కోచ్‌లలో పరిశుభ్రత నిర్వహణతోపాటు వెయిటింగ్ హాల్స్ లాంజ్‌లను పరిశీలించి ప్రయాణికులతో నేరుగా మాట్లాడారు. నిర్వహణ, ఇతర సదుపాయాలపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఫుడ్ కోర్టులు, క్యాటరింగ్ స్టాల్స్, 'ఒన్ స్టేషన్-ఒన్ ప్రొడక్టు' వంటి వాటిని పరిశీలించి విక్రయదారులతో మాట్లాడి పరిశుభ్రత పాటించాలని, నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు చేపట్టాలని లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్పీఎఫ్ సిబ్బందితో మాట్లాడి భద్రత నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఫుట్ బోర్డు ప్రయాణం నివారించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సురక్షిత ప్రయాణాన్ని కల్పించేందుకు చిత్తశుద్ధి, నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఏడీఆర్ఎం ఇ.శాంతారామ్, వివిధ విభాగాల అధికారులున్నారు.